



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 191 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు మంగళవారం 17 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :191 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE TUE 17 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## ఏమిటీ అర్ధరాత్రి బదిలీలు...?

### కేంద్ర ఎన్నికల సంఘంపై మమత ఆగ్రహం

- బెంగాల్‌లో కీలక అధికారులను బదిలీ చేసిన ఈసీ
- ఈసీ నిర్ణయంపై సీఎం మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం
- బీజేపీకి అనుకూలంగా ఈసీ ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ఆరోపణ
- ఎన్ని మార్పులు చేసినా బెంగాల్‌లో ప్రభుత్వం మారదని స్పష్టం
- తన ఇంటిపై కూడా దాడి జరిగే అవకాశం ఉందని మమత వ్యాఖ్య

- మిగతా2లో

## రామాయపట్నం నుంచి కడపకు రైల్వే లైన్..

### కేంద్రం ఓకే చెప్పిందన్న సీఎం చంద్రబాబు



- రాష్ట్రంలో పోర్టుల ప్రగతిపై చంద్రబాబు సమీక్ష
- రాష్ట్రాన్ని ఈస్ట్-వెస్ట్ కార్గో కారిడార్‌గా అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశం
- మూలపేట, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల పనులు వేగవంతం చేయాలని సూచన
- 2026 డిసెంబర్ నాటికి మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల పూర్తికి లక్ష్యం
- ప్రతి 50 కిలోమీటర్లకు పోర్టు, ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు దిశగా ప్రణాళికలు

- మిగతా2లో

## బీహార్‌లో ఐదు రాజ్యసభ స్థానాలను క్లీన్ స్వీప్ చేసిన ఎన్డీయే

- బీహార్‌లోని ఐదు రాజ్యసభ స్థానాలను గెలుచుకున్న ఎన్డీయే
- సీఎం నితీశ్ కుమార్ సహా ఐదుగురు అధికార కూటమి అభ్యర్థులు విజయం
- ఓటింగ్‌కు దూరంగా ఉన్న నలుగురు ప్రతిపక్ష ఎమ్మెల్యేలు
- తమ ఎమ్మెల్యేలను బీజేపీ గృహనిర్బంధం చేసిందని కాంగ్రెస్ ఆరోపణ
- ఎన్డీయే విజయానికి దోహదపడిన అసెంబ్లీలో సంఖ్యాబలం



పెన్ పవర్ డెస్క్:బీహార్‌లో జరిగిన ఐదు రాజ్యసభ స్థానాల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. ఐదు స్థానాల్లోనూ తమ అభ్యర్థులను గెలిపించుకుని ప్రతిపక్ష 'మహాగఠ్‌బంధన్'కు గట్టి షాక్ ఇచ్చింది. ఈ విజయంతో ఎన్డీయే కూటమి తమ సంఖ్యాబ లాన్ని మరోసారి నిరూపించుకుంది. ఎన్డీయే తరఫున ముఖ్యమంత్రి, జేడీయూ జాతీయ అధ్యక్షుడు నితీశ్ కుమార్, బీజేపీ నేత నితిన్ నబిన్, కేంద్ర మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్, రాష్ట్రీయ లోక్ మోర్చా

- మిగతా2లో



## పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలి

- నియోజకవర్గ పరిశీలకులతో సజ్జల సమావేశం
- వైసీపీ సంక్షేమ పథకాలను ప్రజలకు గుర్తు చేయాలని సూచన
- కూటమి వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపు

పెన్ పవర్ డెస్క్:గత 15 ఏళ్లుగా వైసీపీ ప్రజల పక్షాన నిలబడిందని, ఇప్పుడు 16వ ఏడాదిలోకి అడుగుపెట్టిన తరుణంలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జగన్ హయాంలో జరిగిన సంక్షేమ పథకాలను ప్రజలకు మరోసారి గుర్తు చేయాలని, అదే సమయంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసపూరిత విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ పరిశీలకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని అన్నారు.ముఖ్యంగా టీడీపీ సాగిస్తున్న తప్పుడు ప్రచారాలను వాస్తవాలతో తిప్పికొట్టాలని

- మిగతా2లో

# జిల్లాలో జోరుగా సాగుతున్న నకిలీ వస్తువుల విక్రయాలు

- ప్రముఖ బ్రాండ్ల పేర్లు మాదిరిగా నకిలీ వస్తువులు
- నిత్యావసర వస్తువుల నుండి ఎలక్ట్రానిక్ వస్తువుల వరకు అన్నీ నకిలీలే
- వారపు సంతలలో గిరిజనులకు అంటకడుతున్న వ్యాపారులు
- చిరు వ్యాపారులకు అధిక లాభాల ఆశచూపి అమ్మకాలు జరుగుతున్న వైనం
- నామ మాత్రపు తనిఖీలు కారణంగానే నకిలీ వస్తువుల విక్రయాలకు కారణం







స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, పార్వతీపురం. మార్చి 16 :పార్వతీపురం మన్యం జిల్లాలో నకిలీ వస్తువుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నిత్యావసర సరుకులలో ప్రముఖ బ్రాండెడ్ వస్తువుల పేరుతో నకిలీ ఉత్పత్తులు తయారు చేసి జిల్లాలోని చిరు వ్యాపారుల ద్వారా విక్రయాలు సాగుతున్నాయి. ప్రముఖ కంపెనీల పేర్లు మాదిరి గానే నకిలీ వస్తువుల పేర్లు చిన్న అక్షరం మార్పుతో అచ్చంగా అసలైన వస్తువుల పేర్లు లాగా ఉండటంతో అమాయకులైన గిరిజనులు, పల్లెటూరి కూలీలు ఈ నకిలీ వస్తువులను ఒరిజినల్ వస్తువులనుకుని కొనుక్కుంటూ మోసానికి గురౌతున్నారు. ఆహార పదార్థాల మొదలుకొని విత్తనాలు, మందులు, మరియు ఎలక్ట్రానిక్ వస్తువుల వరకు అన్ని రంగాల్లోనూ ఈ కల్తీ మాఫియా జిల్లాలో విస్తరించింది. నిత్యం వినియోగించే ప్రముఖ కంపెనీలకు చెందిన టీ పౌడర్, కాఫీ, డిటెర్జెంట్ సబ్బులు, డిటర్జెంట్ పౌడర్, స్నానపు సబ్బులు, వంటివి నకిలీ వస్తువులు

- మిగతా2లో



## హార్ముజ్‌ను రక్షించడానికి వస్తాం కానీ..

### డొనాల్డ్ ట్రంప్‌కు చైనా షరతు

- హార్ముజ్ జలసంధిని సురక్షితంగా ఉంచేందుకు కలిసి రావాలన్న ట్రంప్
- పశ్చిమాసియాలో సైనిక కార్యకలాపాలను నిలిపివేయాలని చైనా షరతు
- ఉద్రిక్తతలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని అమెరికాకు సూచన

పెన్ పవర్ డెస్క్:హార్ముజ్ జలసంధిని సురక్షితంగా ఉంచేందుకు ప్రపంచ దేశాలు కలిసి రావాలని అమెరికా అధ్య క్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. హార్ముజ్ ప్రభావంతో ఇబ్బందిపడుతున్న చైనా సహా వివిధ దేశాలు ముందుకు రావాలని ఆయన సూచించారు. ట్రంప్ విజ్ఞప్తిపై స్పందించిన

- మిగతా2లో

## పొట్టి శ్రీరాములు విగ్రహంపై వైసీపీ విమర్శలు దుర్మార్గం



- అమరావతిలో పొట్టిశ్రీరాములు విగ్రహంపై వైసీపీ విమర్శలను ఖండించిన మంత్రి నిమ్మల
- జగన్ ఐదేళ్ల పాలనలో ఆర్యవైశ్యులు తీవ్రంగా నష్టపోయారని ఆరోపణ
- లూటీలకు అలవాటుపడిన వైసీపీ నేతలకు త్యాగాల విలువ తెలియడం లేదని కామెంట్
- రూ.14 లక్షల కోట్ల అప్పు చేసి రాష్ట్రాన్ని జగన్ నాశనం చేశారని విమర్శ
- వెంటిలేటర్‌పై ఉన్న ఆర్థిక వ్యవస్థను ఐసీయూలోకి తీసుకొచ్చామని వ్యాఖ్య

- మిగతా2లో



## హైదరాబాద్‌లో వర్షం.. ఒక్కసారిగా మారిపోయిన వాతావరణం

- ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం
- మాదాపూర్, గచ్చిబౌలి, జూబ్లీహిల్స్ సహా పలు ప్రాంతాల్లో వర్షం
- నగరంలో పలుచోట్ల భారీగా ట్రాఫిక్ జామ్

- మిగతా2లో

## గుండెపోటు కథ ఆమె సృష్టే..

### వివేకా కేసులో సునీతపై అవినాశ్ రెడ్డి సంచలన ఆరోపణలు

- వివేకా హత్య కేసులో సునీతపై ఎదురుదాడికి దిగిన అవినాశ్ రెడ్డి
- గుండెపోటు థియరీని సృష్టించిందే సునీత అని ఆరోపణ
- క్రైమ్ సీన్‌లో దొరికిన లేఖను ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారని విమర్శ
- ఆస్తి తగాదాలు, డాక్యుమెంట్ల దొంగతనం కోణంలో విచారణ జరపాలని డిమాండ్
- చంద్రబాబుకు లబ్ధి చేకూర్చేందుకే కేసును సాగదీస్తున్నారని ఆక్షేపణ



పెన్ పవర్ డెస్క్:మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి, వివేకా కుమార్తె డాక్టర్ సునీతా రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చంద్రబాబుపై వస్తున్న వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే సునీత ప్రెస్ మీట్లు పెడుతున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఈ కేసులో అసలు విచారించాల్సిన కీలక అంశాలను పక్కనపెట్టి, కేవలం రాజకీయ లబ్ధి కోసమే విచారణను తప్పుదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. సోమవారం

- మిగతా2లో

## ఇజ్రాయెల్ దాడులతో దద్దరిల్లిన ఇరాన్... అధ్యక్షుడు వాడే విమానం పేల్చివేత

- ఇరాన్ అగ్రనేతలు వాడే విమానాన్ని ధ్వంసం చేశామన్న ఇజ్రాయెల్
- టెహ్రాన్‌లోని మెహ్రాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఈ దాడి జరిగినట్లు ప్రకటన
- ఈ దాడితో ఇరాన్, దాని మిత్రపక్షాల మధ్య సమన్వయం దెబ్బతింటుందన్న ఐడీఎఫ్
- టెహ్రాన్, షిరాజ్, తబ్రిజ్ నగరాల్లోనూ దాడులు జరిపినట్లు వెల్లడి
- హార్ముజ్ జలసంధి విషయంలో సాయం చేయాలని నాటోపై ట్రంప్ ఒత్తిడి

పెన్ పవర్ డెస్క్:ఇరాన్‌పై ఇజ్రాయెల్ మరోసారి విరుచుకుప డింది. టెహ్రాన్‌లోని మెహ్రాబాద్ విమానాశ్ర యంలో ఇరాన్ అగ్ర నాయకత్వం ఉపయోగించే ఒక కీలక విమానాన్ని ధ్వంసం, పలు సైనిక స్థావరాలను చేసినట్లు సోమవారం ప్రకటించింది. ఈ దాడితో ఇరాన్, దాని మిత్రపక్షాల మధ్య సమన్వయం దెబ్బతింటుందని ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) పేర్కొంది. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని పరిమితం చేయడమే లక్ష్యంగా ఈ దాడి జరిపినట్లు తెలిపింది.



- మిగతా2లో

# ఎడిటర్ వ్యూ

## లైన్ క్లియర్

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో నారా లోకేశ్ ఒకరకంగా భావి నేతగా అవతరిస్తున్నారు. నారా లోకేశ్ విభిన్నశైలిని చూసిన వారికి ఎవరికైనా త్వరలోనే ఆయన కీలక పదవి అధిష్టించే అవకాశముందని అంచనా వేస్తారు. ఎవరైనా అధికారంలో ఉన్నప్పుడు సమస్యలను ఎత్తి చూపేవారిని శత్రువులుగా చూస్తారు. వైసీపీ హాయంలో సమస్యలు చెప్పిన వాళ్లపై టీడీపీ ముద్ర వేసి వేధించారు. కానీ ఇక్కడ నారా లోకేశ్ మార్పు చూపిస్తున్నారు. సమస్యలను ప్రస్తావించడాన్ని ఓ సానుకూల విషయంగా చూసి వాటిని పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ కోణంలో మన్యంలో సమస్యలపై జాతీయ మీడియా కథనాలు వచ్చినా.. గుంటూరులో డ్రైనేజీ సమస్య గురించి ఓ మహిళ చెప్పినా... ఉద్దేశపూర్వకంగా చేశారని తెలిసినా.. మధ్యాహ్నభోజనం అంశంపై ఓ వీడియోలో విద్యార్థుల ఆగ్రహం గురించి తెలిసినా..ఆయన చాలా పాజిటివ్ గా స్పందించారు. సమస్యల పరిష్కారం కోసం అప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు.

**వైఫల్యాలను ఎత్తి చూపినా...**

సాధారణంగా అధికారంలో ఉన్నవారు తమ వైఫల్యాలను ఎత్తిచూపే వారిని రాజకీయ శత్రువులుగా చూస్తుంటారు. కానీ, ఇప్పుడు నారా లోకేశ్ దానికి విభిన్నంగా వ్యవహరిస్తున్నారు.. తన వద్దకు వచ్చే విమర్శలను, సోషల్ మీడియాలో వచ్చే ఫిర్యాదులను ఆయన ఒక ఫీడ్‌బ్యాక్ గా స్వీకరిస్తున్నారు. సమస్య ఎక్కడ ఉన్నా, అది ఎవరు చెప్పినా.. దాని వెనుక రాజకీయం ఉందా లేదా అని చూడకుండా పరిష్కారం వైపే అడుగులు వేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా దేవునిచెరువు పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత సరిగ్గా లేదని విద్యార్థులు ఆహారాన్ని చెత్తబుట్టలో పోస్తున్న వీడియో వైరల్ అయ్యింది. దీనిపై లోకేష్ స్పందించిన తీరు అందరినీ ఆశ్చర్యపరిచింది. సాధారణంగా ఇలాంటి ఘటనలు జరిగితే సమర్థించుకోవడానికి ప్రయత్నిస్తారు, కానీ లోకేష్ మాత్రం నిస్సంకోచంగా క్షమాపణలు చెప్పారు. బిడ్డలకు నాణ్యమైన ఆహారం అందకపోవడం నా బాధ్యతారాహిత్యం అని పేర్కొంటూ వెంటనే సంబంధిత ఏజెన్సీని తొలగించి, హెడ్ మాస్టర్‌ను సస్పెండ్ చేయించారు. ఒక మంత్రి స్థాయి వ్యక్తి బహిరంగంగా క్షమాపణలు చెప్పడం రాజకీయాల్లో అత్యంత అరుదైన విషయమని కూడా అంటున్నారు.

**కూటమి పార్టీల మధ్య...**

నారా లోకేశ్ విషయంలో కూటమి పార్టీల మధ్య కూడా భిన్నాభిప్రాయాలు ఏమీ లేనట్లే కనిపిస్తుంది. నారా లోకేశ్ పర్యవేక్షణలోనే పరిపాలన నడుస్తుందని మిత్రపక్షాలైన జనసేన, బీజేపీలకు తెలుసు. కానీ వారు మాత్రం దానిని పాజిటివ్ గానే తీసుకుంటున్నారు. ఎటూ జరిగేది అదేనని, అత్యధిక స్థానాలతో అధికారంలో ఉన్న టీడీపీలో నాయకత్వ బాధ్యతను ఎవరికి అప్పగించాలన్నది ఆ పార్టీ నేతల ఇష్టమన్న అభిప్రాయానికి వచ్చేసినట్లు కనిపిస్తుంది. లోకేష్ అనుసరిస్తున్న ఈ సరికొత్త పంథాను జనసేన నాయకుడు, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు కూడా మనస్ఫూర్తిగా ప్రశంసించారు. విమర్శలను స్వీకరించి, వాటిని పరిష్కరించే విషయంలో నారా లోకేశ్ చూపిస్తున్న పరిణతి రాజకీయాల్లో గొప్ప మార్పుకు సంకేతమని ఆయన పేర్కొన్నారు. మొత్తం మీద నారా లోకేశ్ అందరి అనుమతితోనే త్వరలోనే కీలక పదవి చేపట్టే అవకాశాలను ఎవరూ కొట్టిపారేయలేకపోతున్నారు.

## పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలి

- మొదటి పేజి తరువాయి

సజ్జల చెప్పారు. బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని పటిష్ఠం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితా సవరణ విషయంలో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

## హోర్ముజ్‌ను రక్షించడానికి వస్తాం కానీ.. డొనాల్డ్ ట్రంప్‌కు చైనా షరతు

- మొదటి పేజి తరువాయి

చైనా ఒక షరతు విధించింది. ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా దెబ్బతిన్న హోర్ముజ్‌ను సురక్షితంగా ఉంచేందుకు, ఇంధన రవాణాను క్రమబద్ధీకరించేందుకు తాము ముందుకు వస్తామని, కానీ అంతకంటే ముందు పశ్చిమాసియాలో సైనిక కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని అమెరికాకు చైనా షరతు విధించింది. ఈ ఘర్షణల వల్ల అంతర్జాతీయ ఇంధన ప్రవాహం, శాంతి, ప్రపంచ స్థిరత్వం దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి లిన్ జియాన్ మాట్లాడుతూ, ఉద్రిక్తతలు మరింత పెరగకుండా చర్యలు తీసుకోవాలని అమెరికాకు సూచించారు. ఘర్షణలు ఆగితేనే ప్రాంతీయ స్థిరత్వం సాధించగలమని పేర్కొన్నారు. ఈ నెల చివరలో ట్రంప్ బీజింగ్ పర్యటనపై అమెరికాతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. హోర్ముజ్ ప్రాంతం మీదుగా అధిక ప్రయోజనాలు పొందుతున్న దేశం చైనాయేనని ట్రంప్ నిన్న వ్యాఖ్యానించారు. ఆ జలసంధిని రక్షించడానికి కలిసి రావాలని పిలుపునిచ్చారు. చైనా నుంచి వచ్చే సమాధానాన్ని బట్టి తన బీజింగ్ పర్యటనపై నిర్ణయం ఉంటుందని అన్నారు. కాగా, ట్రంప్ పిలుపును జపాన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా సహా పలు దేశాలు పట్టించుకోలేదు.

## బీహార్‌లో ఐదు రాజ్యసభ స్థానాలను క్లీన్ స్వీప్ చేసిన ఎన్డీయే

- మొదటి పేజి తరువాయి

చీఫ్ ఉపేంద్ర కుష్వాహా, బీజేపీ అభ్యర్థి శివేష్ రామ్ బరిలో నిలిచి విజయం సాధించారు. సోమవారం బిహార్ శాసనసభలో జరిగిన పోలింగ్‌లో ఎన్డీయే పక్షాన 202 మంది ఎమ్మెల్యేలు ఓటు వేయగా, మహాగఠ్‌బంధన్ నుంచి కేవలం 37 మంది ఎమ్మెల్యేలు మాత్రమే పాల్గొన్నారు. మరోవైపు, ప్రతిపక్షాలకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు ఓటింగ్‌కు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్‌కు చెందిన మనోజ్ బిస్వాస్, సురేంద్ర కుష్వాహా, మనోహర్ ప్రసాద్ సింగ్, ఆర్జేడీ ఎమ్మెల్యే ఫైసల్ రెహ్మాన్ ఓటింగ్‌లో పాల్గొనలేదు. తమ ముగ్గురు ఎమ్మెల్యేలను బీజేపీ అపహరించి గృహ నిర్బంధంలో పెట్టిందని బిహార్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేశ్ రామ్ తీవ్ర ఆరోపణలు చేశారు. సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కాగా, మొదటి ప్రాధాన్యత ఓట్లతో నితీశ్ కుమార్, నితిన్ నబిన్, రామ్‌నాథ్ ఠాకూర్, ఉపేంద్ర కుష్వాహా గెలిచారు. రెండో ప్రాధాన్యత ఓట్లతో శివేష్ రామ్ విజయం సాధించారు. మహాగఠ్‌బంధన్ అభ్యర్థి ఏ.డి. సింగ్‌కు 38 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ విజయంపై ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా స్పందిస్తూ.. సొంత ఎమ్మెల్యేలే ఓటు వేయని దుస్థితిలో ఆర్జేడీ, కాంగ్రెస్ ఉన్నాయని విమర్శించారు. ద

## ఇజ్రాయెల్ దాడులతో దద్దరిల్లిన ఇరాన్... అధ్యక్షుడు వాడే విమానం పేల్చివేత

- మొదటి పేజి తరువాయి

ఐడీఎఫ్ ప్రకటన ప్రకారం, ధ్వంసమైన విమానం ఎయిర్‌బస్ ఏ340. దీనిని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, గతంలో సుప్రీం లీడర్ అలీ ఖమేనీ వంటి అగ్ర నాయకులు దేశీయ, అంతర్జాతీయ ప్రయాణాల కోసం ఉపయోగించేవారు. టెహ్రాన్‌లోని ఈ విమానాశ్రయంలో దేశీయ విమానాలతో పాటు ఇరాన్ వైమానిక దళానికి చెందిన సైనిక స్థావరాలు కూడా ఉన్నాయి. ఇదే సమయంలో టెహ్రాన్, షిరాజ్, తబ్రిజ్ వంటి ఇతర నగరాల్లోని మౌలిక సదుపాయాలపై కూడా దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. మరోవైపు, హోర్ముజ్ జలసంధిని తెరిచి ఉంచే విషయంలో అమెరికాకు మిత్రదేశాలు సాయం చేయకపోతే నాటో భవిష్యత్తు 'చాలా దారుణంగా' ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఫైనాన్షియల్ టైమ్స్ కథనం ప్రకారం, ఆదివారం ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. హోర్ముజ్ జలసంధి ద్వారా యూరప్ దేశాలు ఎక్కువగా లబ్ధి పొందుతున్నాయని, కాబట్టి అక్కడి భద్రతకు వాళ్లు కూడా బాధ్యత వహించాలని ట్రంప్ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ విషయంలో అమెరికా గతంలో యూరప్‌కు సాయం చేసిందని, ఇప్పుడు వారు తమకు సాయం చేయాల్సిన సమయం వచ్చిందని ఆయన వాదించారు.

# జిల్లాలో జోరుగా సాగుతున్న నకిలీ వస్తువులు విక్రయాలు

- మొదటి పేజి తరువాయి

మార్కెట్లలో అధికంగా చలామణి అవుతున్నాయి. ఇవి ప్రముఖ కంపెనీలుకి చెందిన వాటిలానే పోలికలుతో ఏమాత్రం నకిలీ అనేది పోల్చుకోకుండా వీటిని తయారు చేస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నారు నకిలీ కేటుగాళ్ళు. ఈ నకిలీ వస్తువులు డిటర్జెంటు, కాఫీ, టీ పౌడర్లకే కాకుండా ఆహార పదార్థాలకు కూడా నకిలీ వస్తువుల అమ్మకాలు జరుపుతూ ప్రజల ఆరోగ్యంతో చలగాటం ఆడుతున్నారు. ఈ నకిలీ వస్తువులు జిల్లాలోని పార్వతీపురం, పాలకొండ, సాలూరు వంటి నగరాలతో పాటు గిరిశిఖర గ్రామాలలో అధికంగా జరుగుతుంది. అయితే జిల్లా అధికారుల పర్యవేక్షణ లోపం వలన ఇలాంటి ఉత్పత్తులు అమ్మకాలు జరుపుతున్నారన్నది సర్వత్రా వినబడుతుంది. నకిలీ వస్తువులకు తోడు ఒడిషా వస్తువుల అమ్మకాలు జిల్లాలో జోరుగా జరుగుతున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాకి ఒరిస్సా రాష్ట్రం పక్కనే ఉండటంతో ఒరిస్సాలో నిత్యావసర వస్తువుల ధరలు తక్కువగా ఉండడం వల్ల ఒరిస్సాలో అమ్మవలసిన గోధుమ పిండి, డిటర్జెంటు పౌడర్, సబ్బులు ఇటువంటి చాలా వస్తువులు జిల్లాలో అమ్మకాలు జరుగుతున్నాయి. పక్క రాష్ట్రం వస్తువులు జిల్లాలో అమ్మకం జరపడం వలన రాష్ట్ర ఆదాయానికి తీవ్రంగా గండి కొడుతున్నారు నకిలీ కేటుగాళ్ళు. ఉదాహరణకు ఐటీసీ కంపెనీకి చెందిన ఆశీర్వాద్ గోధుమ పిండి ధర ఆంధ్రాలో ధర 73 ఉండగా అదే గోధుమ పిండి ధర ఒరిస్సాలో 56గా ఉంది. హిందూస్తాన్ కంపెనీకి చెందిన సర్ఫ్‌ఎక్సెల్ పౌడర్ ఆంధ్రలో ధర 85 ఉండగా అదే వస్తువు ఒరిస్సాలో ధర 65గా ఉంది. ఇవేకాక సబ్బులు, సాల్ట్ ఇకా అనేక రకాల నిత్యవసర వస్తువులు ధరలు ఆంధ్రాకి ఒడిషాకి ధరలలో



వ్యత్యాసం ఉండడంతో ఒరిస్సా ఉత్పత్తులని ఆంధ్రాలోకి అక్రమంగా తీసుకొచ్చి అమ్మకాలు జరుపుతున్నారు. దీంతో రాష్ట్ర ఆదాయనికి గండి కొడుతూ తమ జోబులు నింపుకుంటున్నారు నకిలీ మాఫియా.. ఇప్పటికైనా జిల్లా విజిలెన్స్ అధికారులు నిద్ర మత్తు వీడి నకిలీ వస్తువులపై దాడులు చేస్తేగాని ఈ నకిలీ మాఫీయా ఆగడాలకు ముగింపు ఉండదు..

## రామాయపట్నం నుంచి కడపకు రైల్వే లైన్.. కేంద్రం ఓకే చెప్పిందన్న సీఎం చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్‌ను ఒక కీలకమైన ఈస్ట్–వెస్ట్ కార్గో కారిడార్‌గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నూతనంగా నిర్మిస్తున్న పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల పనుల పురోగతిపై సచివాలయంలో సోమవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మూలపేట, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టులలో కార్గో కార్యకలాపాలను వీలైనంత త్వరగా ప్రారంభించాలని స్పష్టం చేశారు. ఈ మూడు పోర్టుల ద్వారా పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటకల నుంచి సరుకు రవాణా జరిగేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. మచిలీపట్నం, రామాయపట్నం పోర్టులను 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని అధికారులు సీఎంకు వివరించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్) రిఫైనరీ ఏర్పాటు తర్వాత రామాయపట్నం పోర్టు ఒక ప్రధాన కంటైనర్, బల్క్ కార్గో కేంద్రంగా మారుతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. రామాయపట్నం నుంచి కడప స్టీల్ ప్లాంట్ వరకు ప్రత్యేక రైల్వే మార్గాన్ని ఏర్పాటు చేసేందుకు రైల్వే శాఖ ఆమోదం తెలిపిందని ఆయన వెల్లడించారు.

పోర్టులకు సమీపంలో పోర్టు టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేయడం ద్వారా వాణిజ్య కార్యకలాపాలు పెరుగుతాయని, పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి కూడా అపార అవకాశాలు ఉన్నాయని సీఎం దిశానిర్దేశం చేశారు. రెండో దశలో చేపడుతున్న బుడిగట్లపాలెం, పూడిమడక, కొత్తపట్నం ఫిషింగ్ హార్బర్ల నిర్మాణ పనులను కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు లేదా ఫిషింగ్ హార్బర్ ఉండేలా చూడటమే లక్ష్యమని, తద్వారా ఏపీ ఈస్ట్ కోస్ట్ లాజిస్టిక్స్ హబ్‌గా మారుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం గల్ఫ్ దేశాల్లో నెలకొన్న యుద్ధ వాతావరణంతో అక్కడి ఓడరేవులు ఇబ్బందుల్లో ఉన్నాయని, ఈ తరుణంలో భారత్‌లోని తూర్పు తీర పోర్టులే సురక్షితమన్న భావన బలపడుతోందని సీఎం అన్నారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని, ఏపీ పోర్టులను కార్గో రవాణాలో గేమ్ ఛేంజర్‌గా మార్చాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఏపీ మారిటైమ్ బోర్డు సీఈఓ అభిషేక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏమిటీ అర్ధరాత్రి బదిలీలు...?

పశ్చిమ బెంగాల్‌లో కీలక ఉన్నతాధికారులను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) బదిలీ చేయడంపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అర్ధరాత్రి వేళ ఈ బదిలీలు చేపట్టడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కనుసన్నల్లోనే ఈసీ పనిచేస్తోందని, ఇది ప్రజాస్వామ్యంపై దాడి అని ఆరోపించారు. సోమవారం అర్ధరాత్రి రాష్ట్ర చీఫ్ సెక్రటరీ నందిని చక్రవర్తి, హోం సెక్రటరీ జేపీ మీనాలతో పాటు డీజీపీ, కోల్‌కతా పోలీస్ కమిషనర్‌ను ఈసీ బదిలీ చేసింది. దీనిపై మమత ఘాటుగా స్పందించారు. "అర్ధరాత్రి ఒంటి గంటకు నాకు మెసేజ్ వచ్చింది. ఇలాంటి చర్యలు ఎప్పుడైనా చూశారా? చీఫ్ సెక్రటరీ ఒక బెంగాలీ మహిళ. ఆమెను తొలగించారు. వీళ్లు బెంగాలీలకు, మహిళలకు వ్యతిరేకులు" అంటూ కేంద్రంపై మండిపడ్డారు. గతంలో అధికారుల బదిలీకి ముందు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ముగ్గురి పేర్లతో జాబితాను ఈసీ కోరేదని, కానీ ఈసారి ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందని మమత ఆరోపించారు. "ఇదేమైనా ఢిల్లీ లడ్డూ అనుకుంటున్నారా? ఇది వాళ్ల జాగీరా?" అని ప్రశ్నించారు. డీజీపీగా ఉన్న పీయూష్ పాండే బెంగాలీ కాదని, ఆయనను కూడా తొలగించారని గుర్తు చేశారు. బీజేపీకి

అనుకూలంగా పనిచేసే వారిని మాత్రమే ఎంపిక చేసుకుంటున్నారని విమర్శించారు. వంటగ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ కోల్‌కతాలో నిర్వహించిన నిరసన ర్యాలీలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. "మీరు అన్నీ మార్చండి.. అయినా సరే బెంగాల్‌లో ప్రభుత్వం మారదు. ఇది నా మాట" అని స్పష్టం చేశారు. రాష్ట్ర మంత్రి శశి పంజా ఇంటిపై దాడి జరిగినట్లే, తన నివాసంపై కూడా దాడి చేసే అవకాశం ఉందని మమత ఆందోళన వ్యక్తం చేశారు. "ధైర్యం ఉంటే వచ్చి దాడి చేయండి. మేం ఎదుర్కొంటాం" అని సవాల్ విసిరారు. అదే సమయంలో, ప్రజలు సంయమనం పాటించాలని, రెచ్చగొట్టే చర్యలకు లొంగవద్దని సూచించారు.

## పొట్టి శ్రీరాములు విగ్రహంపై వైసీపీ విమర్శలు దుర్మార్గం

అమరావతిలో ఏర్పాటు చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహంపై వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలు దుర్మార్గమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. భవిష్యత్ తరాలకు పొట్టిశ్రీరాము లు త్యాగనిరతి స్ఫూర్తిగా నిలవాలనే లక్ష్యంతో 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశామని, ఇది ఎన్నికల హామీని నిలబెట్టుకోవడమేనని స్పష్టం చేశారు. దోపిడీ, లూటీలకు అలవాటుపడిన వైసీపీ నేతలకు త్యాగాల విలువ తెలియడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ఆర్యవైశ్యులు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు. ఎవరికీ సాయం చేయకూడదనే డీఎన్ఏ జగన్‌ది కాబట్టే, కన్నతల్లిని, చెల్లిని కూడా మోసం చేశారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం రూ.14 లక్షల కోట్లు అడ్డగోలుగా అప్పు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిందని మంత్రి విమర్శించారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని తాము అధికారంలోకి వచ్చాక ఐసీయూలోకి తీసుకొచ్చామని అన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలను ఒక్కొక్కటిగా సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ప్రధానమంత్రి మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్ కల్యాణ్ రాష్ట్రంలో సౌకర్యవంతమైన ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నారని నిమ్మల రామానాయుడు వివరించారు.

## హైదరాబాద్‌లో వర్షం.. ఒక్కసారిగా మారిపోయిన వాతావరణం

హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఒక్కసారిగా వాతావ రణం మారిపోయింది. సోమవారం సాయంత్రం భాగ్యనగరంలో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పలు ప్రాంతాలు జలమయమ య్యాయి. కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో వర్షం పడటంతో ఉద్యోగులు, వాహనదారులు ఇబ్బందిప డ్డారు. మాదాపూర్, గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఖైరతాబాద్, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. నగరంలో పలుచోట్ల రోడ్లపై నీరు మోకాళ్ల లోతుకు వచ్చింది. నగరంలో పలుచోట్ల భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వరద నీటిని తొలగించేందుకు డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు రంగంలోకి దిగాయి.

## గుండెపోటు కథ ఆమె సృష్టే.. వివేకా కేసులో సునీతపై అవినాశ్ రెడ్డి సంచలన ఆరోపణలు

- మొదటి పేజి తరువాయి

ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ కేసుకు సంబంధించి అనేక కీలక విషయాలను, తన వాదనలను ప్రజల ముందుంచారు. వివేకా హత్య జరిగిన తర్వాత 'గుండెపోటు' అనే కథనాన్ని తెరపైకి తెచ్చిందే సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి, బాబాయ్ నర్రెడ్డి శివప్రకాశ్ రెడ్డి అని అవినాశ్ రెడ్డి ఆరోపించారు. 2019 మార్చి 16న సిట్ అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో సునీత స్వయంగా గుండెపోటు అనే అనుమానాన్ని వ్యక్తం చేశారని గుర్తుచేశారు. తన తండ్రికి గతంలో స్టెంట్ వేశారని, ఆ కారణంగానే గుండెపోటుతో బాత్రూంలో పడి మరణించి ఉండొచ్చని ఆమె చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. దీనికి బలం చేకూరుస్తూ, బీజేపీ నేత ఆదినారాయణ రెడ్డికి కూడా శివప్రకాశ్ రెడ్డి ఫోన్ చేసి వివేకా గుండెపోటుతో చనిపోయారని చెప్పిన వీడియోను అవినాశ్ ప్రదర్శించారు. తానే గుండెపోటు కథ అల్లి, ఇప్పుడు ఆ నెపాన్ని తమపైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. హత్య జరిగిన ప్రదేశంలో దొరికిన లేఖ అత్యంత కీలకమైన సాక్ష్యమని, ఆ విషయం తెలిసినా సునీత, ఆమె భర్త పోలీసులకు సమాచారం ఇవ్వలేదని అవినాశ్ ఆరోపించారు. పీఏ కృష్ణారెడ్డి ద్వారా లేఖ ఫొటోలు, డెడ్ బాడీ ఫొటోలు చూసినా, అది హత్య అని స్పష్టంగా తెలుస్తున్నా విషయాన్ని దాచిపెట్టడం సాక్ష్యాలను తారుమారు చేయడమేనని అన్నారు. 2020 జులై 28న సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో లేఖ గురించి తనకు తెలుసని అంగీకరించిన సునీత, సరిగ్గా నెల రోజుల తర్వాత ఆగస్టు 27న ఇచ్చిన మరో స్టేట్‌మెంట్‌లో తనకు ఏమీ గుర్తులేదని చెప్పడం విచారణను పక్కదారి పట్టించడమేనని విమర్శించారు. ఒకసారి ఇచ్చిన వాంగ్మూలాన్ని కప్పిపుచ్చుకోవడానికి సీబీఐ మరో వాంగ్మూలం తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ కేసులో ఎన్నో కీలకమైన అంశాలు ఉన్నప్పటికీ, వాటిపై సునీత ఎందుకు తదుపరి విచారణ కోరడం లేదని అవినాశ్ నిలదీశారు. "నిందితుడు దస్తగిరి తన వాంగ్మూలంలో, హత్యకు ముందు వివేకాను డాక్యుమెంట్ల కోసం తీవ్రంగా కొట్టామని, వాటిని తీసుకున్నాకే చంపామని చెప్పాడు. ఆ కీలకమైన డాక్యుమెంట్లు ఏవి? వాటిని రికవరీ చేయాలని సునీత ఎందుకు అడగడం లేదు? వివేకా రెండో భార్య షమీం, ఆమె కుమారుడు షహన్‌షాకు ఆస్తులు చెందకుండా ఉండేందుకు ఈ హత్య జరిగి ఉండవచ్చన్న కోణంలో ఎందుకు విచారణ జరపడం లేదు? వివేకా తన ఆస్తులను వారికి ఇవ్వాలనుకున్న విషయం విచారణలో స్పష్టమైంది. దీనివల్ల నష్టపోయేది ఎవరు? ఆ దిశగా దర్యాప్తు జరపాలని ఎందుకు కోరడం లేదు? దస్తగిరి తన స్టేట్‌మెంట్‌లో వివేకాకు ఉన్న అక్రమ సంబంధాల గురించి ప్రస్తావించాడు. ఆ నేపథ్యంలో కూడా హత్య జరిగి ఉండొచ్చు కదా? ఆ కోణంలో విచారణ జరపాలని ఎందుకు అడగడం లేదు? హత్య జరిగిన రోజు రాత్రి వివేకా ఇంటి వద్ద ఉండే అటెండర్ పండింటి రాజశేఖర్‌ను, సునీత తల్లి సౌభాగ్యమ్మ, భర్త రాజశేఖర్ రెడ్డి బలవంతంగా కానిపాకం పంపించారు. ప్రతిరోజూ ఉండే అటెండర్‌ను ఆ ఒక్కరోజే ఎందుకు పంపించాల్సి వచ్చింది? ఇది అనుమానాస్పదం కాదా?" అని అవినాశ్ ప్రశ్నించారు. హత్యలో తానే ఉన్నానని అంగీకరించిన అప్రూవర్ దస్తగిరి బెయిల్‌ను రద్దు చేయాలని తాము కోర్టుకు వెళితే, సునీత వెంటనే ఇంప్లీడ్ పిటిషన్ వేసి, లూథ్రా వంటి సీనియర్ న్యాయవాదిని పెట్టి మరీ దస్తగిరి బెయిల్‌ను ఎందుకు కాపాడుతున్నారని అవినాశ్ ప్రశ్నించారు. ఇది వారి మధ్య ఉన్న కుమ్మక్కును బయటపెడుతోందన్నారు. ఢిల్లీలోని ఓ తెలుగు పెద్దమనిషి అండతో సీబీఐ డైరెక్టర్‌ను నియమించుకుని, చంద్రబాబుతో కలిసి సునీత ఈ కేసు విచారణను పూర్తిగా తమకు అనుకూలంగా మార్చుకున్నారని అవినాశ్ ఆరోపించారు. తాము చెప్పినట్టు వాంగ్మూలం ఇవ్వని సాక్షులను సీబీఐ విచారించలేదని, కేవలం ట్యూటర్ చేసిన సాక్షులతోనే స్టేట్‌మెంట్లు రికార్డు చేయించిందన్నారు. హిమకుంట్ల గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని, "అవినాశ్ రెడ్డి గుండెపోటు అని చెప్పాడని నువ్వు చెప్పాలి" అని సునీత, ఆమె భర్త ఒత్తిడి చేశారని, కానీ ఆ వ్యక్తి అబద్ధం చెప్పడానికి నిరాకరించారని వివరించారు.

రాబోయే ఎన్నికల వరకు ఈ కేసును రాజకీయంగా వాడుకోవాలనేది చంద్రబాబు, సునీతల ఉమ్మడి లక్ష్యమని అవినాశ్ రెడ్డి ఆరోపించారు. కేసు విచారణలో అనవసర పిటిషన్లు వేస్తూ ట్రయల్‌ను ఆలస్యం చేస్తున్నారని మండిపడ్డారు. దేవుడి దయ, చట్టం ముందు తాను నిర్దోషిగా నిరూపించుకుంటానని, నిజం ఏదో ఒక రోజు తప్పకుండా బయటకు వస్తుందని పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు.

పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

# ప్రజా సౌకర్యాలే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## గిద్దలూరులో రు 1.01 కోట్ల సి.సి రోడ్లకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే ముత్తుముల




**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 16**

గిద్దలూరు పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా రు1 కోటి 1 లక్షల వ్యయంతో నూతన సి.సి రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పట్టణ లోని రాచర్ల రోడ్ లోని టీచర్స్ కాలనీ, నల్లబండ బజార్, అర్బన్ కాలనీ, శ్రీరామ్ నగర్ వార్డులలో శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు నూతన సి సి రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. అభివృద్ధి పనులు నాణ్యతప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గిద్దలూరు పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. స్థానిక మహిళలు తమ అభిప్రాయాన్ని తెలుపుతూ ఎన్నో సంవత్సరాల నుంచి సరి అయిన రోడ్లు లేక ఎన్నో ఇబ్బందులు పడ్డాము అని నేడు మీరు ఇచ్చిన మాట ప్రకారం కొత్త రోడ్లు మంజూరు చేసినందుకు మీకు ఎప్పుడూ రుణపడి ఉంటాం అని కృతజ్ఞతలు తెలిపారు అనంతరం ఎమ్మెల్యే శాలువ, పూల మాలతో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, మార్కెట్ యార్డ్ చైర్మన్, పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ లు వార్డు నాయకులు, ఇంచార్జ్ లు, మహిళలు,అధికారులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ బజార్‌లో డ్రైనేజీ కాలువల గందరగోళం

## ప్రజలకు తీవ్ర ఇబ్బందులు



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 16**

గిద్దలూరు పట్టణంలోని పోలీస్ స్టేషన్ బజార్ ప్రాంతంలో ఇటీవల నిర్మించిన డ్రైనేజీ కాలువల వల్ల స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. అధికారుల సరైన పర్యవేక్షణ లేకుండా, ప్రణాళికా లోపంతో కాలువలను రోడ్డు కంటే ఎత్తుగా నిర్మించడంతో ప్రజలు నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. కాలువలు ఎత్తుగా ఉండటంతో కొంతమంది తమ ఇళ్లలోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆగ్రహానికి గురైన స్థానికులు కొన్ని చోట్ల కాలువలను పగలగొట్టినట్లు సమాచారం. మరికొన్ని ప్రాంతాల్లో ప్రజలు తామే కాలువలను తొలగిస్తూ సమస్యను పరిష్కరించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు నడవడానికి మార్గం లేకపోవడంతో పాటు వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడటంతో ఈ చర్యలకు దిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇష్టారాజ్యంగా రోడ్లను పగలగొట్టి కాలువలు నిర్మించడం వల్ల ప్రజాధనం వృథా అవుతోందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపమే ఈ పరిస్థితికి కారణమని స్థానికులు మండిపడుతున్నారు.

# త్యాగానికి నిలువెత్తు రూపం పొట్టి శ్రీరాములు

## ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



**మార్కాపురం పెన్ పవర్ మార్చి 16**

పొట్టి శ్రీరాములు త్యాగాలు, ఆశయాలు, పోరాటాలను భవిష్యత్తు తరాలు స్ఫూర్తిగా తీసుకోవాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవాలు స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు పాల్గొన్నారు.



తెలుగు రాష్ట్రం కోసం అమరుడైన అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని అమరావతిలో సీఎం నారా చంద్ర బాబునాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ లు సంయుక్తంగా అమరావతిలో ఆవిష్కరించిన కార్యక్రమాన్ని వర్చువల్ గా కలెక్టరేట్ లో అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ మన జాతిపిత మహాత్మా గాంధీ సైతం పొట్టి శ్రీరాములు లాంటి వ్యక్తులు ఇంకో పది మంది ఉంటే ఎప్పుడో స్వాతంత్రం సిద్ధించేదని అన్నారని గుర్తు చేశారు. అంతటి పోరాటపటిమగల పొట్టి శ్రీరాములు అప్పటి ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో కలిసి ఉన్న తెలుగు ప్రజల కష్టనష్టాలను చూసి బాధపడి తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని మద్రాస్ లో ఆమరణ నిరాహార దీక్ష 58 రోజులు పాటు చేపట్టి అమరుడయ్యాడని అన్నారు. అది చూసిన తెలుగు ప్రజలకు రాష్ట్రమంతటా ఉద్యమం వ్యాపించి అప్పటి ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ తెలుగు ప్రజలకు ఆంధ్రప్రదేశ్ నామకరణంతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేశారని చెప్పారు.ఆయన త్యాగానికి గుర్తుగా ఆంధ్ర రాష్ట్ర రాజధాని అయిన అమరావతిలో 58 అడుగుల అమరజీవి పొట్టి శ్రీరాములు భారీ విగ్రహం ఈ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఆనందకరమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పొగాకు బ్యారన్ దగ్ధం

## -10 లక్షల మేర ఆస్తి నష్టం.




**తర్లుపాడు పెన్ పవర్ మార్చి 16**

ప్రమాదవశాత్తు పొగాకు బ్యారన్ దగ్ధమైన ఘటన మండల కేంద్రమైన తర్లుపాడులోని సోమవారం ఉదయం చోటు చేసుకుంది. గ్రామంలోని నాయుడు పల్లె కాలనీలోని చేతుల చిన్న వెంకటేశ్వర్లు, మాలకొండయ్య, సంపూర్ణ లకు ఉమ్మడికి చెందిన పొగాకు బ్యారన్ దగ్ధమైంది. బ్యారన్ పొగాకు అల్లిన 1300 కర్రను క్యూరింగ్ కోసం ఉంచారు. క్యూరింగ్ సమయంలో ప్రమాదవశాత్తు ఆకు రాలిపడటంతో మంటలు వ్యాపించి బ్యారన్ మొత్తం అగ్నికు అవుతయింది. ఈ ప్రమాదంలో సుమారు 10 లక్షలు మేర నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు. మార్కాపురం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే బ్యారన్, అందులోని పొగాకు పూర్తిగా మంటల్లో కాలిపోయింది. ఆరుగాలాలు శ్రమించి పండించిన పొగాకు క్యూరింగ్ సమయంలో అగ్నికి ఆహుతి అవ్వడంతో పాటు, బ్యారన్ కూడా పూర్తిగా దగ్ధమవడంతో రైతులు కన్నీరు మున్నీరుగా వినిపిస్తున్నారు.

# ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యం

## మీ కోసం కార్యక్రమంలో 32 ఫిర్యాదులు





**మార్కాపురం టౌన్ పెన్ పవర్ మార్చి 16**

ప్రజల నుండి వచ్చే వివిధ రకాల ఫిర్యాదులకు పరిష్కారం కల్పించాలనే లక్ష్యంతో మార్కాపురం జిల్లా ఇంచార్జ్ ఎస్పీ వి. హర్షవర్ధన్ ఆదేశాల మేరకు డీఎస్పీ యు. నాగరాజు, పోలీస్ అధికారులు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదులను పోలీస్ అధికారులు స్వీకరించి, ఫిర్యాదుదారులతో ముఖాముఖీగా మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. అందిన ప్రతి ఫిర్యాదుపై చట్టప్రకారం సమగ్ర విచారణ చేపట్టి సత్వర పరిష్కారం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని బాధితులకు భరోసా కల్పించారు. అదేవిధంగా అందిన ఫిర్యాదుల వివరాలను సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి త్వరితగతిన చట్ట ప్రకారం విచారణ జరిపి భాదితులకు న్యాయం అందించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా భూ వివాదాలు, ఉద్యోగ మోసాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక మోసాలు, చీటింగ్ కేసులు మరియు ఇతర సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు తమ ఫిర్యాదులను స్థానిక పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్-డివిజన్ కార్యాలయాలలో కూడా అందజేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొదిలి సీఐ రాజేష్ కుమార్, గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య, కంభం సీఐ మల్లికార్జున రావు సిబ్బంది పాల్గొన్నారు.

# శీలంవారిపల్లిలో 21న రాష్ట్రస్థాయి ఆర్సిసి క్రికెట్ టోర్నమెంట్

**సి ఎస్ పురం, పెన్ పవర్, మార్చి 16**

మార్కాపురం జిల్లా, చంద్రశేఖరపురం మండలం శీలంవారిపల్లి గ్రామంలో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని రాష్ట్రస్థాయి 23వ ఆర్సీసీ క్రికెట్ టోర్నమెంట్ ను ఈ నెల 21న కనిగిరి మాజీ శాసనసభ్యులు కదిరి బాబురావు ప్రారంభించనున్నట్లు ఆర్సీసీ క్రికెట్ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ క్రికెట్ పోటీలు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు మొదటి బహుమతిగా కదిరి ప్రకాశరావు అండ్ బ్రదర్స్ తరపున రూ. 75,116 నగదు మరియు షీల్డ్, ద్వితీయ బహుమతిగా మాజీ ఎంపీటీసీ మునగల వెంకట నారాయణరెడ్డి మరియు మునగల ప్రవీణ్ కుమార్ రెడ్డి తరపున రూ. 45,116 నగదు మరియు షీల్డ్, తృతీయ బహుమతిగా కదిరి రత్నం కుమారుడు శివ తరపున రూ. 25,116 నగదు మరియు షీల్డ్, చతుర్ధ బహుమతిగా రావూరి నారయ్య జ్ఞాపకార్థం కుమారులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు తరపున రూ. 15,116 నగదు మరియు షీల్డ్ అందజేయనున్నట్లు తెలిపారు.టోర్నమెంట్ కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ షేక్ ఖాజావలి (బొంబాయి జ్యువెలర్స్) రూ. 4,116 నగదు మరియు షీల్డ్ ప్రకటించగా, ప్రతి మ్యాచ్ కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతిని కదిరి వెంకటనరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఇరగని చలపతి అందజేయనున్నారు. అలాగే బెస్ట్ బ్యాట్స్మన్, బెస్ట్ బౌలర్ బహుమతులను మూరం నారాయణరెడ్డి ప్రకటించారు. టోర్నమెంట్ నిర్వాహణలో భాగంగా గ్రౌండ్ శుభ్రపరిచే బాధ్యతను సర్పంచ్ బుజ్జి, టెంట్ మైకు సెట్టింగ్ దాత కొట్టే శ్రీనివాసులు




(మేస్త్రి), క్రీడాకారులకు భోజన వసతి కల్పించిన దాతలు పిడుగు రామాంజయ్య జ్ఞాపకార్థం మనుమడు పోతంశెట్టి రాకేష్, లింగం కొండయ్య జ్ఞాపకార్థం కుమారులు దినేష్, మహేష్ అందిస్తున్నారు మినరల్ వాటర్ ను శంకరశెట్టి ఆదినారాయణ అండ్ బ్రదర్స్, ఉచిత మజ్జిగ పంపిణీ రావూరి రత్నం జ్ఞాపకార్థం కుమారులు కిరణ్, రాజేష్ చేపడుతున్నారు కరపత్రాలను ప్రచురించిన దాత షేక్ నాయబ్ రసూల్ అందజేశారు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు సహకరించిన దాతలకు మరియు యూత్ ఫోర్సు కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు టోర్నమెంట్లో పాల్గొనదలచిన జట్టు వెయ్యి రూపాయలు ఎంట్రీ ఫీజు చివరి తేదీ 20 లోపు నమోదు చేసుకోవాలని సూచించారు పూర్తి వివరాలకు ముడియాల గోపి (943355202) షేక్ సత్తార్ (7013898748) ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

# ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలి

## ఎంపీడీవో ఎల్. బ్రహ్మయ్య

**సి.ఎస్.పురం, పెన్ పవర్, మార్చి 16**

మండలంలోని కోవిలంపాడు గ్రామపంచాయతీ పరిధిలో చేపడుతున్న ఇంటి పన్ను వసూలు కార్యక్రమాన్ని సోమవారం ఎంపీడీవో ఎల్. బ్రహ్మయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా కోవిలంపాడు మరియు శీలంవారిపల్లి గ్రామాలలో పర్యటించి వసూళ్ల ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు.కోవిలంపాడు గ్రామంలో సర్పంచ్ షేక్ ఖాదర్ బీ బుజ్జి ద్వారా ఇంటి పన్ను వసూలు చేసి నమోదు చేసి రసీదును అందజేశారు. ఇంటి పన్ను వసూలు నమోదైన వివరాలను సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడి ఇంటి పన్ను గురించి వివరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎల్. బ్రహ్మయ్య మాట్లాడుతూ కోవిలంపాడు గ్రామపంచాయతీలో ఇంటి పన్ను వసూళ్లు ఆశించిన స్థాయిలో లేవని, పన్ను వసూళ్లను వేగవంతం చేసి లక్ష్యాలను చేరుకోవాలని గ్రామ సచివాలయ సిబ్బందికి సూచించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తూ పన్ను చెల్లింపులను ప్రోత్సహించాలని సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు.



# ప్రశాంతంగా ముగిసిన టెన్త్ తెలుగు పరీక్ష

**కొమరోలు పెన్ పవర్ మార్చి 16**



కొమరోలు లోని పదవ తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాలలో సోమవారం నిర్వహించిన తెలుగు పేపర్ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరిండెంట్లు తెలిపారు. పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి .అందులో భాగంగా కొమరోలు మండలంలోని పలు పాఠశాలల్లో చదువుతున్న 409 మంది పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాసేందుకు కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్లో ఒక పరీక్షా కేంద్రాన్ని సర్వైట్ హైస్కూల్లో మరొక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు సోమవారం నిర్వహించిన తెలుగు ప్రశ్నాపత్రం పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని వారి తెలిపారు కొమరోలు ప్రభుత్వ హైస్కూలు పరీక్షా కేంద్రంలోని నిర్వహించిన తెలుగు ప్రశ్నాపత్రం పరీక్షకు మొత్తం 216 మంది విద్యార్థులు హాజరయ్యారని వారి కొరకు తొమ్మిది గదులు ఏర్పాటు చేసి తొమ్మిది మంది ఇన్విజిలేటర్లను నియమించామని ఆ పరీక్ష కేంద్ర చీఫ్ సూపర్డెంట్ శివనాగేశ్వరరావు, డిపార్ట్మెంట్ అధికారి బి కే శ్రీనివాసులు తెలిపారు. సర్వైట్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి మొత్తం 193 మంది విద్యార్థులు హాజరై తెలుగు పరీక్ష రాశారని ,వారి కొరకు తొమ్మిది గదులు ఏర్పాటు చేసి పరీక్ష నిర్వహించామని ఆ పరీక్షా కేంద్రా చీఫ్ సూపర్డెంట్ షేక్ షేక్షావలి, డిపార్ట్మెంటల్ అధికారి నిరంజన్ కుమార్ తెలిపారు. రెండు పరీక్ష కేంద్రాలలో బుధవారం హిందీ పరీక్ష నిర్వహించనున్నట్లుగా వారు తెలిపారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి..



**పుల్లల చెరువు పెన్ పవర్ మార్చి 16**

పుల్లలచెరువు మండల కేంద్రంలోని ఎస్సీ సెంటర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు.మహిళల అభ్యున్నతి, సమాజంలో వారి పాత్ర, ఆర్థిక స్వావలంబన వంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్వాడి కార్యకర్త హెప్సీబా మాట్లాడుతూ మహిళలు ప్రతి రంగంలో ముందంజలో నిలుస్తున్నారని తెలిపారు.కుటుంబ బాధ్యతలతో పాటు సమాజ అభివృద్ధిలో కూడా మహిళల పాత్ర ఎంతో కీలకమని ఆమె పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడితేనే కుటుంబం, సమాజం మరియు దేశం అభివృద్ధి సాధిస్తుందని ఆమె అన్నారు.స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు పొదుపు అలవాటు పెంపొందించుకోవాలని, చిన్న చిన్న వ్యాపారాల ద్వారా ఆదాయం సంపాదిస్తూ ఆర్థికంగా ఎదగాలని సూచించారు.అలాగే విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల విషయంలో మహిళలు మరింత చైతన్యంతో ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. మహిళలు తమ హక్కులపై అవగాహన కలిగి సమానత్వం కోసం కృషి చేయాలని తెలిపారు.ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.మహిళలు ఐక్యతగా ముందుకు సాగాలని సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు సుజాత,బేబీ రాణి, లక్ష్మీ దేవి,నాగకుమారి,సుమలత,పద్మ బాయి పాల్గొన్నారు.

## రంజాన్ తోఫా పంపిణి

## పేదలను అక్కున చేర్చు కోవడమే

**టీడీపీ నియోజకవర్గఇంచార్జి గూడూరి ఏరిక్షన్ బాబు**




**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ మార్చి 16**

రంజాన్ పండుగ సందర్బంగా సాటి నిరుపేద ముస్లీంలకు నిత్యావసర వస్తువులతో కూడిన రంజాన్ తోఫా అందిస్తున్న ముస్లీం యూత్ సొసైటీ గొప్ప మానవత కార్యక్రమం చేసిందని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. ఆదివారం జామియా మసీదు ప్రాంగణంలో ముస్లీం యూత్ సొసైటీ ఫౌండర్ షేక్ ఇస్మాయిల్ ఏర్పాటు చేసిన రంజాన్ తోఫా కార్యక్రమంలొ ఆయన పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం నిరుపేద ముస్లీంలు రంజాన్ పండుగను సంతోషంగా చేసుకునేలా, నిత్యావసర వస్తువులను అందించడం వారిని అక్కున చేర్చుకోవడమేనని అన్నారు.ముస్లీం యూత్ సొసైటీ ద్వారా ఇప్పటికే అనేక సామాజిక సేవా కార్యక్రమాలు, రక్తధాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఫౌండర్ షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతు సేవే మార్గం సేవే లక్షంగా ముస్లీం యూత్ సొసైటీ పనిచేస్తుందని, పేదవారు ఆకలి దప్పికలతో అలమటించకూడదని అందరిలాగే రంజాన్ పండుగ చేసుకోవాలని రంజాన్ తోఫా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలొ మత పెద్దలు మౌలానా హీదాయతుల్లా, మౌలానా మహమ్మద్, మౌలానా జుబేర్, మౌజన్లు, కరీముల్లా మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, వేగినాటి శ్రీనివాస్, మంత్రునాయక్, తోట మహేష్ నాయుడు, సయ్యద్ అల్లమాలిక్ తదితరులు పాల్గొన్నారు.

## షి" మూవీ ప్రీ రిలీజ్ వేడుకలో ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 16**

గిద్దలూరు పట్టణంలోని తిరుమల కన్వెన్షన్ హాల్‌లో గిద్దలూరు పరిసర ప్రాంతాల యువతతో కలిసి గిద్దలూరు వాసులు నిర్మించిన "షి" మూవీ ప్రీ రిలీజ్ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి చిత్రాన్ని విడుదల చేసి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక యువత ప్రతిభకు ప్రోత్సాహం "షి" మూవీని చిత్రీకరించడం ఇది ఎంతో గర్వించదగ్గ విషయం అని ముఖ్యంగా మన ప్రాంత స్థానికులు నటించడం పరిసర ప్రాంతాలలో చిత్రం నిర్మాణం చేసినందుకు చిత్ర యూనిట్ కి ప్రత్యేక అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, బెల్లంకొండ సాయి బాబా,అంబవరం శ్రీనివాస రెడ్డి, కమతం శ్రీనివాసులు, బోనేనీ వెంకటేశ్వర్లు , భూమిరెడ్డి రామచంద్రారెడ్డి , సయ్యద్ షహాన్ షా వలి, గుర్రం డానియేలు తదితర నాయకులు, పాల్గొన్నారు.

# అమరజీవి త్యాగం చిరస్మరణీయం

## -వైకాపా కార్యాలయంలో ఘనంగా జయంతి నివాళులు

**కందుకూరు పెన్ పవర్, మార్చి 16:**

వైఎస్ఆర్సిపి కార్యాలయంలో జరిగిన ఆంధ్ర రాష్ట్ర సాధకులు స్వాతంత్ర సమరయోధులు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 125 వ జయంతి సందర్భంగా స్థానిక పామూరు రోడ్ లోని వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జి మాజీ శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాల మేరకు జరిగిన కార్యక్రమంలో ఘనంగా జయంతి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అమరజీవి ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం సాగించిన పోరాట స్ఫూర్తి ఇప్పటికీ ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు చిరస్మరణీయమని అభిప్రాయపడ్డారు. ఆశయ సాధన కోసం ఆయన చూపిన పోరాట పటిమ స్ఫూర్తి యువతరానికి ఎంతో ఆదర్శనీయమని అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి కోసం సామాజిక న్యాయ సాధకుడు జగనన్న స్ఫూర్తితో రాష్ట్రాన్ని సంక్షేమ అభివృద్ధి లో ముందుకు తీసుకుపోవటానికి తిరిగి జగనన్న రాజ్యం సాధించుకొనుటకు నాయకులు కార్యకర్తలు పని





చేయాలని అన్నారు. ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలోపట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, కందగడ్డల వెంకటేశ్వర్లు, నాగసూరి శ్రీనివాసులు, తోకల కొండయ్య, గణేశం గంగిరెడ్డి, ముప్పవరపు కిషోర్, గేరా మనోహర్, వల్లూరి కోటేశ్వరరావు, బద్దిపూడి జయరావు, తల్లపనేని గోపి, కానాల శివప్రసాద్, దొడ్డం రెడ్డి మదన్మోహన్ రెడ్డి, షేక్ రహీం, కొత్తగొర్ల వసంతలక్ష్మి, దేవరకొండ ఆదిలక్ష్మి, తన్నీరు ధరణి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతకు 'అండ'గా కూటమి ప్రభుత్వం -పోట్ల గోవింద్



**పుల్లల చెరువు పెన్ పవర్ మార్చి 16**

రాష్ట్రంలోని అన్నదాతల సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందనీ టీడీపీ మండల కన్వీనర్ పోట్ల గోవింద్ అన్నారు. సాగును లాభసాటిగా మార్చి, రైతును రాజును చేయాలన్న సంకల్పంతో చేపట్టిన 'రైతన్నా మీకోసం' వారోత్సవాలు పుల్లలచెరువు మండలంలో విజయవంతంగా కొనసాగుతున్నాయి.సోమవారం మండలంలోని ఐ.టీ.వరం గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పాల్గొని ప్రతి ఇంటి తలుపు తట్టారు.ఈ సందర్భంగా పుల్లలచెరువు మండల టీడీపీ అధ్యక్షుడు పోట్ల గోవిందు మాట్లాడుతూ పెట్టుబడి కష్టాలకు చెక్.. అన్నదాత సుఖీభవఅని అన్నారు.గత ప్రభుత్వం రైతును విస్మరిస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. ముఖ్యంగా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఒకే ఏడాదిలో మూడు విడతలుగా కలిపి ప్రతి రైతుకు 20,000 రూపాయలు ఆర్థిక సాయం అందజేస్తున్నామని తెలిపారు. ఈ మొత్తం నేరుగా రైతుల ఖాతాల్లో జమ కావడం వల్ల, విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు సామాన్యుడికి పెట్టుబడి భారం తప్పుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.కేవలం పథకాలు ప్రకటించడమే కాకుండా, అవి క్షేత్రస్థాయిలో రైతులకు ఏ మేరకు అందుతున్నాయో తెలుసుకోవడమే ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని గోవిందు పేర్కొన్నారు. ఐ.టీ.వరం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు.రైతులు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు మరసు నాసరయ్య,మిల్లు వెంకటేశ్వర్లు, ఎస్. రాముడు, డి. యోగయ్య, ఎస్. సుబ్బారాయుడు,స్వర్ణగ్రామ సచివాలయ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి



**పుల్లల చెరువు పెన్ పవర్ మార్చి 16**

పుల్లల చెరువు మండల కేంద్రంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపవరపు గురునాథం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.కార్యక్రమం ప్రారంభంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన జీవిత చరిత్ర, ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం చేసిన త్యాగాలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపవరపు గురునాథం మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు చేసిన ఆత్మత్యాగం భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు.ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆయన చేపట్టిన నిరాహార దీక్ష ప్రజల హృదయాలను కదిలించి, చివరకు ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని గుర్తు చేశారు. ఆయన చూపిన త్యాగమార్గం యువతకు ఆదర్శంగా నిలవాలని అభిప్రాయపడ్డారు. సమాజం కోసం పని చేయడం, సేవా భావంతో ముందుకు సాగడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.పలువురు మాట్లాడుతూ యాబది ఎనిమిది రోజులు పాటు సుదీర్ఘ అమరణ నిరాహార దీక్ష చేపట్టి తెలుగువారికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములని కొనియాడారు. ఆయన చేసిన త్యాగఫలితంగా ఈరోజు అమరావతిలో 58 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషాదాయకం అన్నారు. ఈ సందర్భంగా కోటమి ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.పొట్టి శ్రీరాములు ఆశయాలను పాటిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.


# విద్యార్థులకు పలకలు, ప్యాడ్లు పంపిణి

### అందజేసిన బొంతల కృష్ణ



**పెన్ పవర్ తర్లుపాడు మార్చి 16**

తర్లుపాడు మండలం చెన్నారెడ్డి పల్లి ఉన్నత పాఠశాల, మోడల్ ప్రైమరీ పాఠశాలలలో రాష్ట్ర కిసాన్ మోర్చా ట్రెజరర్ బొంతల కృష్ణ విద్యార్థులకు పలకలు ప్యాడ్లు అందజేశారు. సోమవారం అమర జీవి పొట్టి శ్రీరాములు 125 వ జయంతి సందర్బంగా కృష్ణ సతీమణి కుసుమాంబ వారి తల్లిదండ్రులు బొంతల చెంచయ్య, వెంకట సుబ్బమ్మ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదియోగి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలకలు



ప్యాడ్స్ పంపిణీ చేశారు. అదేవిధంగా ఉన్నత పాఠశాలలో 6 నుండి 9వ తరగతి విద్యార్థులందరికీ పరీక్ష అట్టలు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రవిశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు భారతి దేవి, ఉపాధ్యాయులను కృష్ణ దంపతులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమం ఏర్పాటు కు సహకరించిన ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు పెరుమాళ్ళ కోటి మోహన్ , ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం లో ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రవిశేఖర్ రెడ్డి, నరసింహారావు, కోటి మోహన్, చంద్ర శేఖర్ రెడ్డి, రమేష్, కిషోర్, ఇందిర ప్రసన్న కుమారి, అంగన్వాడీ టీచర్స్ నాగమణి,, గ్రామ పెద్దలు పేరం లక్ష్మణరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్ పోటీలలో ఓవరాల్ ఛాంపియన్ గా కదిరి బాబురావు ఉద్యాన కళాశాల విద్యార్థులు



**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 16**

పశ్చిమగోదావరి జిల్లా వెంకట రామన్నగూడెం లో గల డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలలో సియస్ పురం కదిరి బాబురావు ఉద్యాన కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.మూడవ సంవత్సరం చదువుతున్న యం. విష్ణు పరుగు పందేం లో 400,200,100,మీటర్స్ లో మొదటి బహుమతి అలాగే లాంగ్ జంప్, హైజంప్ లో మూడవ బహుమతి సాధించి ఓవారల్ ఛాంపియన్ గా నిలిచాడు. అదేవిధంగా ద్వితీయ సంవత్సరం చదువుతున్న చరణ్ తేజ, 400పరుగుపందేం లో మొదటి బహుమతి, 200,100మీటర్స్ లో ద్వితీయ బహుమతి సాధించారు. నాలుగోవ సంవత్సరం చదువుతున్న పవన్ హైజంప్ లో ద్వితీయ బహుమతి సాధించారు.ఈ సందర్భంగా విజేతలకు విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్. కె.ధనుంజయ రావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి ఓవరాల్ ఛాంపియన్ గా నిలిచిన విద్యార్థుల కు విద్యాసంస్థల వ్యవస్థాపకులు, కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు,కళాశాల చైర్మన్ కె వి. ప్రకాశ్ రావు, సెక్రటరీ ఒకరెస్పాండంట్ కదిరి పార్ధసారధి, కళాశాల డీన్ డాక్టర్ పి వీరన్న గౌడ్, అధ్యాపకులు, తదితరులు అభినందనలు తెలియజేసారు.

# గాలికుంటు వ్యాధి నివారణకు పశువులకు టీకాలు

### పశు వైద్యాధికారి డాక్టర్ మునీర్



**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 16**

మండలంలోని దర్శిగుంటపేట గ్రామంలో సోమవారం పశువుల్లో గాలికుంటు వ్యాధి సోకకుండా నివారణ చర్యల్లో భాగంగా టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దర్శిగుంటపేట పశు వైద్యాధికారి డాక్టర్ మునీర్ పర్యవేక్షించారు.ఈ సందర్భంగా గ్రామంలోని గేదెలు, ఆవులకు టీకాలు వేసి పాడి రైతులకు మరియు పశు పోషకులకు వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. పశువులను ఆరోగ్యంగా ఉంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శుభ్రత, పోషకాహారం వంటి అంశాలపై సలహాలు సూచనలు ఇచ్చారు.ఈ సందర్భంగా డాక్టర్ మునీర్ మాట్లాడుతూ మండల పరిధిలో పనిచేస్తున్న పశువైద్య సహాయకులను ఐదు బృందాలుగా విభజించి టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి 16, 2026 నుండి ఏప్రిల్ 29, 2026 వరకు సుమారు 45 రోజులపాటు ప్రతి గ్రామంలో నాలుగు నెలల వయస్సు పైబడిన దూడలు, ఆవులు, గేదెలకు టీకాలు వేయనున్నట్లు చెప్పారు.వ్యాధుల బారిన పడకుండా పశువులను రక్షించుకోవడం ద్వారా పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని తెలిపారు. పశువైద్య సహాయకులు గ్రామాల్లో అందుబాటులో ఉంటారని, రైతులు ఈ టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు భువనగిరి శివన్నారాయణ, విజయ్, హనుమంతు, పశు పోషకులు, రైతులు పాల్గొన్నారు.

# మౌలానా మౌజన్లకు దుస్తులు పంపిణి

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ మార్చి 16**

పట్టణంలోని జామియా మసీదు నందు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు సోమవారం ఇమామ్ మౌజన్ లకు రంజాన్ పండుగ సందర్భంగా దుస్తులు పంపిణీ చేసారు.గూడూరి ఎరిక్షన్ బాబు మతపెద్దలు, ముస్లీంలతో ప్రార్ధనలు చేసారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు పవిత్ర రంజాన్ మాసంలో ముస్లీంలు, భక్తి శ్రద్దలతో ఉపవాస దీక్ష చెప్పడతారని, వారి ప్రార్థనలు ఫలించాలని అన్నారు. ఈ కార్యక్రమం లో ముస్లిం మత పెద్దలు మౌలానా హీదాయతుల్లా, మౌలానా మహమ్మద్, మౌలానా జుబేర్,టీడీపీ మండలపార్టీ నాయకులు,కూటమి నాయకులు పాల్గొన్నారు.



# పొట్టి శ్రీరాములుకు ఘననివాళి





**కందుకూరు పెన్ పవర్ మార్చి 16:**

అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలను కందుకూరు పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పెద్దబజారులో గల పొట్టిశ్రీరాములు విగ్రహానికి సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు సహా పలువురు పార్టీ నేతలు, ఆర్యవైశ్య సోదరులు పూలమాలవేసి నివాళులు అర్పించారు. సబ్ కలెక్టర్ హిమవంశీ మాట్లాడుతూ తెలుగు మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలన్న సంకల్పంతో 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఎలాంటి పదవిలో లేకపోయినప్పటికీ, ప్రజల మేలుకోరి జీవితాన్ని ఫణంగా పెట్టారని అన్నారు. ఆయనను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సబ్ కలెక్టర్ కోరారు. పట్టణ టిడిపి అధ్యక్షుడు మల్లేశ్వరరావు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగానికి గుర్తుగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , రాజధాని అమరావతిలో 58 అడుగుల భారీ కాంస్యవిగ్రహాన్ని, స్మృతివనాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. పొట్టి శ్రీరాములు జీవితం మనందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరు మండల టీడీపీ అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, ఆర్యవైశ్య నాయకులు మురారిశెట్టి వెంకట సుధీర్, డాక్టర్ మల్లికార్జున కాకుమాని ప్రవీణ్, మురారిశెట్టి శ్రీకాంత్, కోట కిషోర్, కోట నరసింహం, టిఎస్ శ్రీను, వేమూరి సుధాకర్, దేసు వెంకటేశ్వర్లు, మురారిశెట్టి వెంకటేశ్వర్లు, తట్టవర్తి శివ, కంకణాల వెంకటేశ్వర్లు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబు, రాష్ట్ర ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, కంద్రా మాల్యాద్రి, షేక్ రూబీ, గొంది నరసింగరావు, నియోజవర్గ బీసీ సెల్ అధ్యక్షులు ముచ్చు శ్రీనివాసరావు, నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు అల్లం వెంకటేశ్వర్లు, ముచ్చు వేణు, బెజవాడ ప్రసాద్, చుండూరి శ్రీను, మేడా మల్లికార్జున, గుమ్మా శివ, భవనాసి వెంకటేశ్వర్లు, మచ్చా మనోహర్, అన్ని వార్డుల అధ్యక్షులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

## అమరజీవి పొట్టి శ్రీ రాములు ప్రాణ త్యాగం మరువలేనిది



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ మార్చి 16**

ఆంధ్ర రాష్ట్ర అవతరణకోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణ త్యాగం చేసిన, పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. సోమవారం పొట్టి శ్రీ రాములు 125వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి లో ఏర్పాటు చేసిన 58 అడుగుల కాంస్య విగ్రహ ఆవిష్కరణ లైవ్ కార్యక్రమంను వీక్షించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీ రాములు తెలుగు రాష్ట్రం కోసం అయన చేసిన కృషి ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, ఆయన స్ఫూర్తితో ఆశయాలు కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు,మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు,మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, పట్టణ అధ్యక్షులు పెరుమాళ్ళ మల్లికార్జున,నాయకులు వేగినాటి శ్రీనివాస్, కొత్తమాసు సుబ్రహ్మణ్యం, తోట మహేష్ నాయుడు,అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరా ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయి ప్రజ్ఞా 2కె26




**మార్కాపురం పెన్ పవర్ మార్చి 16**

స్థానిక ఇందిరా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రజ్ఞా 2కె26 జాతీయ స్థాయి సాంకేతిక, సంస్కృతిక, క్రీడా ఉత్సవం ఘనంగా నిర్వహి స్తున్నారు. అందులో భాగంగా రెండవ రోజు సోమవారం పవర్ పాయింట్, పోస్టల్ ప్రజెంటేషన్, క్విజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని పోస్టర్ ప్రజెంటేషన్ చేశారు. రెండు రోజులుగా జరుగుతున్న క్విజ్, ఆటల పోటీలు,తదితర కార్యక్రమాలలో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం సుమారు లక్ష రూపాయలు విలువచేసే బహుమతులను అందజేయనున్నారు.ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.శంకర్ బాబు, డిప్లమా ఇంచార్జ్ మాధవి, వివిధ విభాగాల హెచ్.ఓ.డి లు, అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

### ప్రజా పిర్యాదులు వేదికలో జేసికి డా. ఏలూరి వినతి

**మార్కాపురం పెన్ పవర్ మార్చి 16**

జిల్లాలో వేసవి కాలంలో తలెత్తనున్న తాగునీటి సమస్య పరిష్కారానికి ముందస్తుగా తగు చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులును కోరారు. సోమవారం కలెక్టరేట్ లో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులుకు డాక్టర్ ఏలూరి వినతిపత్రాన్ని అందజేశారు. వేసవికాలం ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో తాగునీటి సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నందున అధికారులు ముందుగానే తగిన చర్యలు తీసుకోవాలని ఆయన లేఖలో పేర్కొన్నారు. పట్టణాలు, గ్రామాలలో నీటి సరఫరా చేసే పైపులైన్లను పరిశీలించి అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని, పనిచేయని చేతి పంపులు (హ్యాండ్ పంపులు) మరమ్మత్తు చేయాలని కోరారు. వేసవికాలంలో నీటి అవసరం అధికంగా ఉండే పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అవసరమైన ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని కూడా సూచించారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు తాగునీరు మరియు పశుగ్రాసం కొరత ఏర్పడకుండా కూడా తగిన చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు. అధికారులు దీనిపై వెంటనే స్పందించి



ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్లు డా. ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గోళ్ల సతీశ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు..

**పుల్లల చెరువు పెన్ పవర్ మార్చి 16**

పుల్లలచెరువు మండలంలో సోమవారం నిర్వహించిన పదో తరగతి తెలుగు పబ్లిక్ పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగింది. మండల పరిధిలో మొత్తం 378 మంది విద్యార్థులు పరీక్షకు నమోదు కాగా, అందులో 374 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు.మండల విద్యాశాఖ అధికారులు ఎం. వెంకట భాస్కర్ మరియు ఎం. జె. ఇందిరా ప్రసాద్ వెల్లడించిన వివరాల ప్రకారం మండలంలోని పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా జరిగాయి. అధికారులు పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించడంతో పాటు పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.మండలంలో గైర్హాజరైన విద్యార్థుల వివరాలను వెల్లడిస్తూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పుల్లలచెరువు కేంద్రంలో ఇద్దరు విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిడికిటివారిపల్లి కేంద్రంలో మరో ఇద్దరు విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని చెప్పారు.మొత్తం మీద పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు, విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణలో పరీక్షలు ప్రశాంతంగా కొనసాగినట్లు తెలిపారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకుని ఉత్సాహంగా పరీక్ష రాశారని అధికారులు తెలిపారు.

## మార్చి నెలాఖరులోగా ఇంటి పన్ను కొళాయి పన్ను చెల్లించండి

**కొమరోలు పెన్ పవర్ మార్చి 16**



కొమరోలు గ్రామ పంచాయతీ పరిధి లోని ప్రజలు తమ ఇంటి పన్నులను ఈ నెలాఖరులోగా చెల్లించి గ్రామపంచాయతీ అభివృద్ధికి సహకరించవల సిందిగా కొమరోలు గ్రామ సచివాలయం కార్యదర్శి ఓ ఆర్ జనార్ధన్ రెడ్డి ప్రజలకు తెలిపారు. ఇంటి పన్నులు, కొళాయి పన్నులు చెల్లించడంలో ప్రజలు అలసత్వం ప్రదర్శిస్తున్నందువల్ల గ్రామపంచాయతీ అభివృద్ధి కుంటుపడుతున్నదని, అంతేగాక ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన తెలిపారు. కావున ఇంటి పన్నులు , కొళాయి పన్నులు సకాలంలో చెల్లించి గ్రామపంచాయతీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. అలాగే ఇంటి హద్దులు ,ఆధార్ నెంబర్, ఫోన్ నెంబర్ ,ఇంటి కొలతలు ఆన్లైన్లో పరిశీలించుకుని ఏవైనా తప్పులు ఉంటే వాటిని సవరించుకోవాలని జనార్ధన్ రెడ్డి కోరారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 16**

గిద్దలూరు పట్టణంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన పోరాట స్ఫూర్తి, తెలుగు ప్రజల హక్కుల కోసం చేసిన త్యాగం గురించి ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం, ప్రత్యేక రాష్ట్రం కోసం ఆయన చేసిన త్యాగం భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. తెలుగు ప్రజలకు స్వంత రాష్ట్రం రావాలనే మహత్తర సంకల్పంతో పొట్టి శ్రీరాములు అహింసా మార్గంలో పోరాడారని. తన ప్రాణాలను సైతం త్యాగం చేసి తెలుగు జాతికి గౌరవం తీసుకువచ్చారన్నారు. ఆయన చేపట్టిన నిరాహార దీక్ష, ఆయనలో ఉన్న ధైర్యం, సంకల్పబలం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిచ్చే అంశాలన్నారు. ఆయన త్యాగం ఫలితంగా తెలుగు ప్రజల ఆకాంక్ష నెరవేరి ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించిందని, తర్వాత అది అభివృద్ధి చెందుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా రూపుదిద్దుకుందన్నా. ఇది ఒక వ్యక్తి త్యాగం ఎంత గొప్ప మార్పును తీసుకురాగలదో చూపించిన చారిత్రక ఉదాహరణ. ఎస్నారు పొట్టి శ్రీరాములు జీవితాన్ని చూస్తే మనకు ఒక విషయం స్పష్టంగా తెలుస్తుందని స్వార్థం లేకుండా ప్రజల కోసం పనిచేస్తే చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోవచ్చునన్నారు తెలుగు భాష, తెలుగు సంస్కృతి, తెలుగు ప్రజల గౌరవం కోసం ఆయన చేసిన పోరాటం ప్రతి తరానికి ఆదర్శం అన్నారు నేటి యువత కూడా ఆయన త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధి కోసం పనిచేయాలని మన తెలుగు జాతి గౌరవాన్ని మరింత పెంచే బాధ్యత మన అందరిదీ అన్నారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు కు మనం వినమ్ర నివాళులు అర్పిస్తూ ఆయన ఆశయాలనుముందుకు తీసుకెళ్లాలని మనమందరం సంకల్పిద్దాం అని ప్రజలకు వివరించారు. ఇంతటి పోరాట స్పూర్తని కారణంగా రాష్ట్రశీ ఏర్పాటు కారణంగా నేడు ఆ అమరజీవి కి రాష్ట్ర రాజధాని అమరావతి ప్రాంతంలో " 58 " అడుగుల కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారన్నారు. అనంతరం తెలుగు జాతి గౌరవం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడి పోరాట స్ఫూర్తి గురించి వివరించి ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో మండల, పట్టణ, నాయకులు, అధికారులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.

## మార్కాపురం జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా గోటికె



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 16**

మార్కాపురం జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గా గిద్దలూరు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గోటికె రవీంద్రనాథ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మార్కాపురం లో ఆసంఘం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలో గిద్దలూరు , కనిగిరి, ఎర్రగొండపాలెం , దోర్నాల, కంభం, బెస్తవారిపేట లకు చెందిన విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన రవీంద్రనాథరెడ్డి ని పలువురు అభినందించారు.

## సి ఎస్ పురం లో ప్రశాంతంగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు

### ఎంఈఓ రాజాల కొండారెడ్డి

**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 16**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు రత్నం జూనియర్ కాలేజీ పరీక్షా కేంద్రాల్లో సోమవారం పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు మండల విద్యాశాఖాధికారి రాజాల కొండారెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సి ఎస్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో మొత్తం 246 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు, అలాగే రత్నం జూనియర్ కాలేజీ పరీక్షా కేంద్రంలో 106 మంది విద్యార్థులకు గాను 104 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని, ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. మొత్తం రెండు కేంద్రాల్లో కలిపి 352 మంది విద్యార్థులకు గాను 350 మంది పరీక్షలకు హాజరై పరీక్షలు రాసినట్లు తెలిపారు పరీక్షలు ఎటువంటి అంతరాయం లేకుండా ప్రశాంతంగా నిర్వహించినట్లు, పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని, అధికారుల పర్యవేక్షణలో పరీక్షలు సజావుగా జరిగాయని అన్నారు.

## ఉద్యాన హబ్‌గా నియోజకవర్గాన్ని తీర్చి దిద్దాలి !!

### సాంకేతికత పై రైతుకు అవగాహన కల్పించాలి

**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 16**

వ్యవసాయాధికారులు రైతును రాజును చేసేందుకు రైతన్న మీకోసం వారోత్సవాలు నిర్వహించి రైతు సాంకేతికతను అందిపుచ్చుకుని ముందుకు సాగేవిధంగా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి వ్యవసాయాధికారులు సూచించారు శాసనసభ్యులు, గిద్దలూరు ముత్తుముల అశోక్ రెడ్డి తమ క్యాంపు కార్యాలయంలో గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల వ్యవసాయ అధికారుల తో సమీక్షా సమావేశం నిర్వహించి ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం నియోజకవర్గంలోని



ప్రతి ఒక్క గ్రామంలో "రైతన్న మీకోసం " వారోత్సవాలు వ్యవసాయ , అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించి ప్రతి ఒక్క రైతు ఇంటి వద్దకి వెళ్లి రానున్న ఐదు సంవత్సరాలలో రైతును రారాజును చేసేందుకు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు( అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ ) 5 కార్య చరణ విధానాలను తెలియజేయాలని, ఏ పి ఏ పి ఐ ఎమ్ ఎస్ రైతు యాప్ యొక్క ప్రాముఖ్యతను తెలియజేయాలని, సాగుకు సాంకేతికతను జోడించుట మొదలైన ఆధునిక పద్ధతుల గురించి రైతులకు వివరించాలని, రానున్న రోజుల్లో ఉద్యాన శాఖ పంటలకు అధిక డిమాండ్ ఉన్నందువలన ఉద్యాన హబ్ లోకి మన నియోజకవర్గాన్ని తీసుకురావడం వలన అధిక రాయితీలు పొందవచ్చునని గ్రామస్థాయిలో రైతులకు తెలియజేయాలని సూచనలు అందించారు.

## కల, కలం రేపుతున్న చిరుత సంచారం

### ట్రాప్ కెమెరాల ఏర్పాటు

**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 16**

గిద్దలూరు కు అతిసమీప గ్రామమైన తిమ్మాపురం లో మొక్కజొన్న పొలంలో చిరుతపులి కనిపించడంతో కలకలం రేగుతుంది. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఫ్ ఆర్ ఓ నరసింహారావు తొ మాట్లాడుతూ ప్రజలు ఎవరూ భయాందోళన చెందనవసరం లేదని , చిరుత పులి కదలికలను గుర్తించేందుకు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలు రాత్రి సమయంలో ఒంటరిగా పొలాలకు వెళ్లవద్దని, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అటవీ శాఖ అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ గ్రామ ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

## 16వ తేదీ నుంచి ప్రారంభమైన పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం.



**కొమరోలు పెన్ పవర్ మార్చి 16**

కొమరోలు మండలంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఈనెల 16వ తేదీ నుంచి వచ్చే నెల 29వ తేదీ వరకు వేసే కార్యక్రమాలు చేపట్టామని కొమరోలు పశువైద్యశాల లైవ్ స్టాక్ అసిస్టెంట్ పి నాగార్జున తెలిపారు. అందులో భాగంగా ఈనెల 16వ తేదీన కొమరోలు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని ఆయన తెలిపారు. ఆ కార్యక్రమంలో నాగార్జున, పశుసంవర్ధక శాఖ సహాయకులు శ్రీనివాసులు, చాణిక్య ,కొండారెడ్డి, దీప్తి, కరిష్మా, రవి, తదితరులు పాల్గొన్నారు.

# స్నేహబంధమూ... ఎంత మధురము...



**కొమరోలు పెన్ పవర్ మార్చి 16**

స్నేహబంధము అంటే కేవలం బ్రతికున్నప్పుడు కలిసిమెలిసి ఐక్యంగా ఉండటమే కాదు , మరణించినా అండగా ఉండటమే నిజమైన స్నేహమని రుజువు చేశారు అల్లినగరం గ్రామానికి చెందిన స్నేహ బృందం. కొమరోలు మండలం అల్లినగరం పంచాయతీలోని ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన రమణయ్య అల్లినగరంలోని హైస్కూల్లో చదివే రోజుల్లో అల్లినగరం గ్రామానికి చెందిన విద్యార్థులతో పాటు మరికొందరు స్నేహితులయ్యారు. ఆ మేరకు రమణయ్య తన స్నేహితుతో కలిసి మెలసి ఉండేవాడు. హైస్కూల్ చదువు పూర్తి అయిన తర్వాత స్నేహితులు ఎవరికి వారుగా దూరమయ్యారు. అయితే ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన రమణయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న రమణయ్య స్నేహితులు అల్లా బకాష్ బాలయ్య శ్రీను తలడిల్లిపోయారు. వారు సోమవారం ఎర్రగుంట్ల గ్రామానికి వెళ్లి మృతి చెందిన తన స్నేహితుడు రమణయ్య మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబానికి సానుభూతి ప్రకటించారు. అంతేకాక రమణయ్య దహన సంస్కారాలకు అవసరమైన 20,000 రూపాయలు నగదును రమణయ్య తల్లిదండ్రులకు అందించి తమ స్నేహితుని పట్ల తమకున్న స్నేహ బంధాన్ని చాటుకున్నారు. స్నేహితులు రమణయ్య అంత్యక్రియలలో పాల్గొని మానవత్వాన్ని చాటుకున్నారు. దీనితో ఆ గ్రామ ప్రజలు, రమణయ్య తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు,,బంధువులు రమణయ్యపూర్వ స్నేహితులను అభినందించారు.

# షాదీ ఖానా నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి

### వైసీపీ నాయకులు సయ్యద్ గౌస్ మోహిద్దీన్



**మార్కాపురం పెన్ పవర్ మార్చి 16**

మార్కాపురం పట్టణంలో పెండింగ్ లోనున్న షాదీ ఖానా నిర్మాణాన్ని వెంటేనే పూర్తి చేయాలని జిల్లాకలెక్టర్ ను వైసీపీ మైనార్టీ అధికారప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ కోరారు. అనేక సంవంత్సరాలుగా ఈ షాదీ ఖానా పెండింగ్ లోనుందని ఆయన తెలిపారు. 2024 లో అన్నా రాంబాబు తన సొంత నిధులతో ఈ షాదీ ఖానా నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు ప్రయత్నించారని, కానీ సగం పూర్తయ్యేసరికి ఎన్నికల కోడ్ రావడంతో ఆ నిర్మాణం ఆగిపోయిందన్నారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం వచ్చినా షాదీ ఖానా నిర్మాణం మాత్రం ముందుకు కదలడం లేదన్నారు. మార్కాపురం పట్టణంలో మైనార్టీలు అధికంగా ఉన్నారని, షాదీ ఖానా నిర్మాణం పూర్తయితే వారికి ఇది ఎంతో కలిసివస్తుందని సయ్యద్ గౌస్ మోహిద్దీన్ తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని కూటమి సర్కార్ స్థానిక కలెక్టర్ గారు జోక్యం చేసుకొని ఈ షాదీ ఖానా నిర్మాణంను వెంటనే పూర్తి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పవిత్ర రంజాన్ మాస శుభాకాంక్షలు

## -ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ మంత్రి మహీధర్ రెడ్డి







**కందుకూరు పెన్ పవర్, మార్చి 16**

ముస్లిం సోదర సోదరీమణులకు మాజీమంత్రి మానుగుంట మహీధర్ రెడ్డి పవిత్ర రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. పెద్ద మసీదులో జరిగిన ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులు, ముస్లిం ఐక్యవేదిక ఆహ్వానం మేరకు మాజీ మంత్రి మానుగుంట మహీధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహీధర్ రెడ్డి మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసంలో ఈరోజు ఎంతో ప్రత్యేకమైన రోజు అని ఈ సందర్భంగా ఉపవాసాలు ఉండి అల్లాకు ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులకు వివిధ కారణాల వలన ప్రార్థనలు చేయలేకపోయినా ముస్లిం సోదరులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పవిత్ర మాసంలో నిక్కచ్చిగా నియమాలు పాటిస్తూ మాసం యొక్క పవిత్రతను కాపాడుతూ ఎలాంటి ఆటంకాలు లేకుండా నిరాటంకంగా సాగుతున్నందుకు అల్లా చూపుతున్న కృపకు ధన్యవాదాలు తెలుపుతూ మరొక్కసారి ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివి లింగయ్య నాయుడు, షేక్ మహబూబ్ బాషా, సురేష్ రెడ్డి, ఇంటూరి హరిబాబు, తొట్టెంపూడి శ్రీనివాసులు, ఇంటూరి మాధవరావు, కుమ్మర బ్రహ్మయ్య, గంగవరపు వెంకటరావు, ఉన్నం వెంకటేశ్వర్లు, దారం మాల్యాద్రి, పబ్బిశెట్టి శివ, మాదాల నరసింగరావు, జాజుల కోటేశ్వరరావు, ఆవుల మాధవరావు, కూనం రామకృష్ణారెడ్డి, గోసల వెంకారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పరిటాల వీర స్వామి, కంచర్ల బాలాజీ, దాసరి మాల్యాద్రి, పెంచల్ రెడ్డి, దండే రమేష్, షేక్ హమీద్, షేక్ అమీర్, ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగుల సంక్షేమం కోసం

# సమగ్రశిక్ష ప్రత్యేక కార్యక్రమాలు

### రాష్ట్ర అదనపు సంచాలకులు రవీంద్రనాథ్ రెడ్డి

**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 16**

దివ్యాంగుల కోసం సమగ్రశిక్ష ఆధ్వర్యంలో పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు రాష్ట్ర అదనపు సంచాలకులు కె రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆటిజం సమస్య ఉన్న పిల్లల కోసం 125 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు ప్రకాశం జిల్లాలో మున్సిపల్ ప్రాంతాల్లో 9 ఆటిజం కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు ఆటిజం వ్యాధి పిల్లల కోసం ప్రత్యేక గదులు మరుగుదొడ్లు నిర్మించి సదుపాయాలు కల్పిస్తామన్నారు ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.22.75 లక్షలు ఖర్చు చేస్తున్నామన్నారు ఆటిజం రుగ్మతతో బాధపడుతున్న వారికి చాలా ఖరీదైన చికిత్స అవసరమని, కానీ ప్రభుత్వ ఆధ్వర్యంలో పూర్తి ఉచితంగా చికిత్స అందిస్తున్నామన్నారు ఒంగోలు, దరిశి, చీమకుర్తి, గిద్దలూరు, కనిగిరి, మార్కాపురం, ఎర్రగొండపాలెం లలో ఆటిజం కేంద్రాలు నిర్మాణంలో ఉన్నాయని, త్వరలో పూర్తవుతాయన్నారు దివ్యాంగుల భవిత కేంద్రాలను బలోపేతం చేస్తున్నామన్నారు వారికోసం ప్రత్యేక బోధన అభ్యాసన సామాగ్రిని కూడా అందుబాటులో ఉంచామని, బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని నూరు శాతం నమోదు నూరు శాతం నిలకడ లక్ష్యంగా ప్రత్యేక ఎన్రోల్మెంట్ డ్రైవ్ లు నిర్వహిస్తున్నామన్నారు ప్రతి విద్యార్థి పై తరగతికి ప్రమోట్ చేయబడి చదువు కొనసాగించేలా చూడాలన్నారు. బాలికల విద్య



కోసం సమగ్రశిక్ష ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు

**కేజీబీవీ భవనాల పరిశీలన**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం కేజీబీవీలో నిర్మిస్తున్న ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ల్యాబోరేటరీ గదుల నిర్మాణాలను పరిశీలించారు సుమారు రూ.80 లక్షలు ఖర్చు చేస్తూ సైన్సు ల్యాబోరేటరీ గదులు నిర్మిస్తున్నామని అన్నారు ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఒకేషనల్ విద్య అమలును తనిఖీ చేశారు ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష రాష్ట్ర అదనపు సంచాలకులు కె రవీంద్రనాథ్ రెడ్డి వెంట జిసిడివో కె. హేమలత, మండల విద్యాశాఖాధికారులు జె ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి, ప్రిన్సిపాల్ షేక్ రేష్మ, ఏఈ ప్రకాష్ ఉన్నారు.

# వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించండి

### 20 లక్షల రూపాయలతో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు

### ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల, జెసి పులి శ్రీనివాసులు



**మార్కాపురం టౌన్ పెన్ పవర్ మార్చి 16**

వాహనదారులు ట్రాఫిక్ సిగ్నల్స్ ని పాటించి వాహనాలు నడపాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మార్కాపురం పట్టణంలోని కంభం బస్టాండ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ ను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల మార్కాపురం జిల్లా కేంద్రంగా పట్టణం ఏర్పాటు చేయటంతో ట్రాఫిక్ రద్దీ పట్టణంలో విపరీతంగా పెరిగిందని అన్నారు. పోలీస్ శాఖ వారి రిక్వెస్ట్ మేరకు 20 లక్షల రూపాయలతో ఈ ట్రాఫిక్ సిగ్నల్స్ ను ఏర్పాటు చేశామని అన్నారు. వాహనదారులు తగు జాగ్రత్తలతో ట్రాఫిక్ సిగ్నల్స్ ను ఫాలో కావాలని క్రాస్ లైన్ వంటి పనులు చేయవద్దని తద్వారా పట్టణంలో ట్రాఫిక్ నియంత్రిద్దామని వాహనదారులను కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యాడ్ చైర్మన్ వెంకటరెడ్డి, టౌన్ ఎస్ఐ సైదుబాబు, ట్రాఫిక్ ఎస్ఐ హారోన్, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# నారాయణస్వామి ఆదివారం ఆదాయం రూ.2,50, 980/-లు

**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 16**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణ స్వామి ఆదివారం ఆదాయం 2లక్షల 50 వేల 980 రూపాయలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు దర్శనం టికెట్లు అమ్మకం ద్వారా రూ.46,630/-లు, లడ్డు ప్రసాదం అమ్మకం వలన రూ.30,290/- లు, స్వామి వారి విరాళం ద్వారా రూ.2,150/- లు, శ్రీపాద కానుకల ద్వారా రూ. 6,000/- లు, స్వామివారి పంచామృత అభిషేకమునకు రూ.27,580/- లు, స్వామివారి మహా ప్రాకారమునకు రూ. 25,000/- లు, మహానదానమునకు విరాళముల ద్వారా జమ రూ.1,13,330/- లు వచ్చినట్లు తెలిపారు స్వామివారి మహా ప్రాకారమునకు విరాళముగా దగ్గుపాటి పెద్ద నారాయణ రమణమ్మ దంపతులకు కుమారులు రామ్ నారాయణ, నారాయణస్వామి, నరేష్ 25 వేల రూపాయలు అందజేసినట్లు ఓ ప్రకటనలో తెలిపారు.

# కూటమి ప్రభుత్వంలో మైనార్టీలకు పెద్దపీట

### ఎమ్మెల్యే నారాయణరెడ్డి






**మార్కాపురం టౌన్ పెన్ పవర్ మార్చి 16**

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ప్రభుత్వ ఆధ్వర్యంలో పట్టణంలోని కంభం సెంటర్లో ఉన్న షాది ఖానాలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులతో కలిసి పాల్గొని ముస్లిం సోదరులతో ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ షాదీఖానా లో మిగిలి ఉన్న నిర్మాణ పనులకు రూ. 63 లక్షల నిధులను మంజూరు చేయించామని త్వరలోనే పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ఇంకా రావాల్సిన నిధులను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం సోదర భావాన్ని పెంపొందిస్తాయన్నారు. సమాజంలో ఐకమత్యానికి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం డిఎస్పి నాగరాజు, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి పార్థసారథి, బిజెపి నాయకులు కృష్ణారావు, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, పట్టణంలోని ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# ముత్యాల వర్తకుల విహారయాత్ర ఐక్యతకు నిదర్శనం

### ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాల సందర్శనతో

### ఉత్సాహంగా గడిపిన ముత్యాల అసోసియేషన్ సభ్యులు

**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 16**

ముత్యాల అసోసియేషన్ ఆధ్వర్యంలో ముత్యాల వర్తకులు నిర్వహించిన విహారయాత్ర ఉత్సాహభరితంగా సాగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ముత్యాల వర్తకులు ఈ యాత్రలో పాల్గొని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముత్యాల అసోసియేషన్ చైర్మన్ కదిరి ప్రకాశరావు, పలువురు సభ్యులు మాట్లాడుతూ వర్తకుల మధ్య ఐక్యత, పరస్పర సహకారం పెంపొందించడమే ఈ తరహా విహారయాత్రల ప్రధాన లక్ష్యమని తెలిపారు.ప్రతి సంవత్సరం ముత్యాల అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో సభ్యుల కోసం ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలకు విహారయాత్రలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని అన్నారు వ్యాపార పనుల్లో నిత్యం బిజీగా ఉండే వర్తకులు కొంత సమయం సేదతీరే అవకాశం కల్పించడమే కాకుండా పరస్పర స్నేహబంధాలు మరింత బలపడేలా ఈ యాత్రలు దోహదపడుతున్నాయని వివరించారు.ఈ సందర్భంగా పలు పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించిన వర్తకులు ప్రత్యేక పూజలు నిర్వహించి దేవతల ఆశీస్సులు పొందారు. యాత్రలో పాల్గొన్న సభ్యులు ఈ పరిటాల ఆనందం వ్యక్తం చేశారు అసోసియేషన్ నాయకత్వం చేపడుతున్న విహారయాత్ర ఉత్సాహం నింపుతాయని అభిప్రాయపడ్డారు విహారయాత్రలో ముత్యాల అసోసియేషన్ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జనసేన వర్సెస్ టీడీపీ

**కాకినాడ, మార్చి 16, పెన్ పవర్:** పిఠాపురం నియోజకవర్గ శాశ్వత ఎమ్మెల్యేగా పవన్ కళ్యాణ్ ఉంటారని, ఆయన చేస్తున్న అభివృద్ధే అందుకు నిదర్శనమని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ అయ్యాయి. జనసేన 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పిఠాపురంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పిఠాపురంలో ఇప్పటికే 60,000 మందితో జనసేన ఒక బలమైన కుటుంబంగా మారిందని, త్వరలోనే లక్ష సభ్యత్వాల మార్కును చేరుకుంటామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ కేవలం రాష్ట్ర స్థాయి నేత మాత్రమే కాదు, దేశ స్థాయి నాయకుడిగా ఎదిగారని కొనియాడారు. డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి బాబు కూడా పవన్ కళ్యాణ్ సేవలను కొనియాడుతూ, ఎంపీ వ్యాఖ్యలకు మద్దతు తెలిపారు.జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పిఠాపురంలో పార్టీ శ్రేణులు పండుగ వాతావరణాన్ని తలపించేలా వేడుకలు నిర్వహించాయి. ఉప్పాడ బస్టాండ్ వద్ద భారీ కేక్ కట్ చేసిన అనంతరం, పిఠాపురం నుండి గొల్లప్రోలు వరకు జనసైనికులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. గొల్లప్రోలులో అట్టహాసంగా జెండా ఆవిష్కరణ జరిగింది. రాజకీయ వేడుకలతో పాటు సేవా నిరతిని చాటుకుంటూ, పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఫైవ్ మెన్ కమిటీ సభ్యులు ఓదూరి కిషోర్ సహా భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.అయితే, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వ్యాఖ్యల వెనుక పిఠాపురం నియోజకవర్గంలో సాగుతున్న అంతర్గత రాజకీయ పోరు కారణమనే చర్చ నడుస్తోంది. ఇటీవల ఒక ప్రభుత్వ కార్యక్రమంలో ఫ్లెక్సీపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోటో చిన్నదిగా ఉండటంపై టీడీపీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే వర్మ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ అధికారులపై, జనసేన నేతలపై మండిపడ్డారు. ముఖ్యమంత్రికి ప్రాధాన్యత లేని చోట టీడీపీ కార్యకర్తలకు స్థానం ఎక్కడిదని ఆయన ప్రశ్నిస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కూటమి నాయకులు రాష్ట్ర స్థాయిలో కలిసి ఉన్నప్పటికీ, పిఠాపురంలో మాత్రం టీడీపీ, జనసేన నేతల మధ్య 'కోల్డ్ వార్' నడుస్తోందని స్థానికులు చర్చించుకుంటున్నారు. వర్మ అసహనానికి కౌంటర్ గానే ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ "శాశ్వత ఎమ్మెల్యే" వ్యాఖ్యలు చేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.పిఠాపురంలో శుక్రవారం జరిగిన 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ప్రోటోకాల్ వివాదం చెలరేగింది. మున్సిపల్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోటో చాలా చిన్నదిగా ఉండటంపై మాజీ ఎమ్మెల్యే వర్మ తీవ్రంగా మండిపడ్డారు.

03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## కొబ్బరికి యుద్ధ కష్టాలు

**కాకినాడ, మార్చి 16, పెన్ పవర్:**
కొబ్బరి అనగానే కేరళ తరువాత కోనసీమ గుర్తుకు వస్తుంది. కోనసీమ వ్యాప్తంగా కొబ్బరి ఎగుమతులకు పెట్టింది పేరు. ఇక్కడి నుంచి ప్రతీ రోజూ టన్నుల కొద్దీ కొబ్బరి స్వదేశీ మార్కెట్‌కే కాక ఇతర దేశాలకు ఎగుమతులు అవుతుంటాయి. అయితే మిడిల్ ఈస్ట్‌లో జరుగుతోన్న ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య యుద్ధం ప్రభావం ఈ కొబ్బరి మార్కెట్ పైన కూడా పడిందంటున్నారు కొబ్బరి వ్యాపారులు. ఈ పరిస్థితి ఏపీలోని అంబేడ్కర్ కోనసీమ జిల్లాతోపాటు తమిళనాడు, కేరళ మార్కెట్లపై తీవ్ర ప్రభావం ఉంటుందంటున్నారు. కొబ్బరి సాగుకు దక్షిణాది రాష్ట్రాలైన ఏపీ, తమిళనాడు, కేరళ, కర్ణాటక పెట్టింది పేరు. గతంలో దేశీయ మార్కెట్‌లోనే కొబ్బరి ఎగుమతులు ఉండగా కొన్నేళ్లుగా మన దేశీయ కొబ్బరికి మిడిల్ ఈస్ట్ దేశాల్లో బాగా డిమాండ్ పెరిగింది. ముఖ్యమంగా ఏపీ, తమిళనాడు ప్రాంతాల నుంచి గల్ఫ్ దేశాలకు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయంటున్నారు. రంజాన్ మాసం కావడంతో కొబ్బరికి డిమాండ్ ఏర్పడింది. సాంప్రదాయ వంటకాల్లో కొబ్బరిని ఎక్కవుగా వాడుతున్నారని, దీంతోపాటు ఆదేశ సౌందర్య, ఇతరాత్ర తయారీ సామాగ్రిలో కొబ్బరి వినియోగం బాగా పెరిగిందంటున్నారు. కువైట్, ఒమన్, దుబాయ్, ఇరాన్, సౌదీకి కొబ్బరి ఎగుమతులు జరుగుతుండగా ఆ దేశాలకు ఎగుమతులు చేసేందుకు అంతా సిద్ధం చేశారు.ప్రస్తుతం మిడిల్ ఈస్ట్ దేశాల్లో యుద్ధ వాతావరణంతో గుబులు పుట్టిస్తోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సేనలు విరుచకుపడుతున్నాయి. మరో పక్క దుబాయ్, కువైట్, సౌదీ అరేబియా, ఒమాన్, బెహ్రాయిన్ దేశాలపై ఇరాన్ డ్రోన్లతో దాడులు చేస్తుంది. ఈ పరిస్థితుల్లో ముంబయి, చెన్నై, తూత్తుకూడి పోర్టుల్లోనే కొబ్బరి కాయలతో కంటెయినర్లు నిలిచిపోయాయని అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌కు సంబందించిన కొబ్బరి వ్యాపారులు, రైతులు చెబుతున్నారు.యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో.. ఆయా దేశాలకు ఎగుమతులు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందంటున్నారు. ఆయా ఓడరేవుల్లో ఉన్న సరకును స్థానికంగా తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, ధరల పతనంతో తీవ్రంగా నష్టపోతున్నామంటున్నారు. గత నెలలో శివరాత్రి సందర్భంగా కోనసీమ కొబ్బరి మార్కెట్లో ధరలు ఆశాజనకంగా ఉన్నాయని, వెయ్యి పచ్చి కాయలు రూ.18–20 వేలు పలికాయని రైతులు వెల్లడించారు. కురిడీల ధరలూ బాగానే ఉండగా శ్రీరామనవమికి దేశవ్యాప్తంగా మంచి ధర వస్తుందని వ్యాపారులు ఆశించారు. ఓడరేవుల ద్వారా గల్ఫ్ దేశాలకు వెళ్లే కొబ్బరికాయలు అక్కడే నిలిచిపోవడంతో ధరలపై ప్రభావం చూపిందంటున్నారు.దీంతో ప్రస్తుతం వెయ్యి కాయలు రూ.13–14 వేలకు పతనమయ్యాయని వ్యాపారులు రైతులు అంటున్నారు. ఏపీలో కొబ్బరికి ప్రసిద్ధి చెందిన కోనసీమ జిల్లా అంబాజీపేటలో కొబ్బరికి పెట్టింది పేరు. అలాంటి ప్రాంతం నుంచి రోజు ఇతర రాష్ట్రాలకు పదుల సంఖ్యలో లారీలు ఎగుమతి అయ్యేవి. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఎగుమతులు పూర్తిగా పడిపోయి కొబ్బరి పచ్చికాయ కురిడికాయ ధరలు అమాంతంగా పడిపోవడంతో అటు వ్యాపారులు ఇటు రైతులు ఆవేదన చెందుతున్నారు.

## ఉత్థానం ప్రజలకు భారీ ఊరట

**శ్రీకాకుళం, మార్చి 16, పెన్ పవర్:** చాలా ఏళ్లుగా కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంత ప్రజలకు ఒక గొప్ప శుభవార్త అందింది. పలాసలో ఉన్న కిడ్నీ రీసెర్చ్ సెంటర్ , సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో తొలిసారిగా ఒక కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చాలా విజయవంతంగా జరిగింది. ఈ ఆపరేషన్ ద్వారా సోంపేటకు చెందిన ఒక యువతికి కొత్త జీవితం దొరికింది. ఒక మారుమూల ప్రాంతంలో మెడికల్ కాలేజీ కూడా లేని చోట ఇలాంటి పెద్ద ఆపరేషన్ జరగడం ఆ ప్రాంత ప్రజలకు భారీ ఊరటగానే చెప్పవచ్చు. సోంపేటకు చెందిన సీహెచ్ హేమ శ్రీ అనే యువతి గత కొంత కాలంగా రెండు కిడ్నీలు పాడైపోయి చాలా ఇబ్బందులు పడుతోంది. ఆమె పరిస్థితి చూసి చలించిపోయిన తండ్రి మోహన్ రావు తన కిడ్నీని ఇచ్చేందుకు ముందుకొచ్చారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు మొదలైన ఆపరేషన్ సుమారు మధ్యాహ్నం 3 గంటల వరకు అంటే నాలుగు నుంచి ఐదు గంటల పాటు సాగింది.. డాక్టర్లు చాలా కష్టపడి ఈ ఆపరేషన్ విజయవంతం చేశారు. ప్రస్తుతం హేమశ్రీ కిడ్నీ బాగానే పని చేస్తోందని, ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. అయితే ఆపరేషన్ తర్వాత ఇచ్చే జాగ్రత్తల్లో భాగంగా మరో 15 రోజుల పాటు ఆమెకు వైద్యసేవలు అందిస్తామని డాక్టర్లు తెలిపారు. ఈ ఆపరేషన్ వెనుక ఒక పెద్ద డాక్టర్ల టీమ్ కృషి ఉంది. కేజీహెచ్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రవిరాజు ఈ టీమ్‌కు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పలాస వంటి చిన్న ప్రాంతంలో ఇలాంటి ఆపరేషన్ చేయడం ఇదే మొదటిసారి అని గర్వంగా చెప్పారు. శ్రీకాకుళం కిమ్స్ ఆసుపత్రికి చెందిన సీనియర్ డాక్టర్ ఉమామహేశ్వరరావు కూడా ఈ టీమ్‌లో కీలక పాత్ర పోషించారు. వీరితోపాటు డాక్టర్లు పూర్ణచంద్ర, వివేకానంద, అశోక్‌వర్ధన్, జోగినాయుడు, స్థానిక వైద్యులు రాకేష్, జ్యోత్స్న, ఆసుపత్రి సూపరింటెండెంట్ జే కిశోర్ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధులు అనేవి ఒక పెద్ద సమస్యగా ఉన్నాయి. గతంలో ఇలాంటి ఆపరేషన్లు కావాలంటే విశాఖ, కర్నూలు, గుంటూరు వెళ్లాల్సి వచ్చేది. పలాసలో ఈ కిడ్నీ రీసెర్చ్ సెంటర్ రావడం వల్ల స్థానిక ప్రజలకు ఎంతో ...లు జరుగుతోంది. మారుమూల ప్రాంతంలో ఉన్న ప్రభుత్వాసుపత్రిలో ఇలాంటి సదుపాయాలు ఉండటం గొప్ప విషయమని డాక్టర్ ఉమామహేశ్వరరావు కొనియాడారు. ఈ ఆసుపత్రి నిర్మాణం అభివృద్ధిపై నాయకులు స్పందించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ హయాంలో ఆసుపత్రి నిర్మిస్తే నేడు కూటమి ప్రభుత్వంలో కిడ్నీ మార్పిడి చికిత్సకు చర్యలు చేపట్టినట్టు స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దాతల సహాయంతో పది కొత్త డయాలసిస్ యంత్రాలను ఏర్పాటు చేశామని వైద్య పరికరాల కోసం 9 కోట్లు రూపాయలు, పరిశోధనల కోసం 3 కోట్ల రూపాయలు కేటాయించినట్టు వెల్లడించారు.

## ఏపీ బీజేపీకి ఏమైంది...

**విజయవాడ, మార్చి 16, పెన్ పవర్:** జాతీయస్థాయిలో భారతీయ జనతా పార్టీ దూకుడుగా ఉంది. చాలా దూకుడుగా ముందుకు వెళ్తోంది. కానీ ఏపీలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది పరిస్థితి. పివిఎన్ మాధవ్ పగ్గాలు తీసుకున్నాక పరిస్థితుల్లో మార్పు ఉంటుందని అంతా భావించారు. ఆయన కూడా బాధ్యతలు తీసుకున్నాక చాలా వేగంగా పావులు కదిపారు. కానీ ఎందుకో ఇటీవల ఫుల్ సైలెన్స్ అయ్యారు. పార్టీ కార్యక్రమాలు కూడా తగ్గాయి. ముఖ్యంగా పార్టీలో కార్యవర్గ విభాగాల ఏర్పాటు కూడా జరగలేదు. పక్కనే ఉన్న తెలంగాణలో కొత్త కార్యవర్గాలను ప్రకటించారు. కొత్త కొత్త నేతలకు ఛాన్స్ ఇచ్చారు. కానీ ఏపీలో మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఏమో కూటమిలో ఉన్నామంటే ఉన్నాం అన్నట్టు ఉంది వారి పరిస్థితి.మొన్నటి ఎన్నికల్లో ఓట్లతో పాటు సీట్లను పెంచుకుంది భారతీయ జనతా పార్టీ. ఆ పార్టీ తరపున ఎనిమిది మంది ఎమ్మెల్యేలు గెలిచారు. ముగ్గురు లోక్సభ సభ్యులు అయ్యారు. కేంద్రమంత్రిగా భూపతి రాజు శ్రీనివాస్ వర్మ ఉన్నారు. రాష్ట్ర మంత్రిగా సత్య కుమార్ యాదవ్ ఉన్నారు. మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు ఎమ్మెల్సీ అయ్యారు. ఎంపీలుగా పురందేశ్వరి, సీఎం రమేష్.. ఎమ్మెల్యేలుగా విష్ణుకుమార్ రాజు, సుజనా చౌదరి వంటి సీనియర్లు కొనసాగుతున్నారు. అయినా సరే పార్టీకి ఒక ఊపు తేలేకపోతున్నారు. దీనికి ఏం కారణం అనేది ఇప్పుడు ఒక ప్రశ్న. పొత్తుతో ముందుకు వెళ్తున్నారు సరే. కానీ పార్టీ కార్యక్రమాల విషయంలో సైతం వెనుకబాటు కనిపిస్తోంది. ఇది పార్టీ శ్రేణులకు అంతుపట్టడం లేదు. పార్టీ బలోపేతం అనేది భవిష్యత్తు కలగానే మిగిలిపోతోంది.భారతీయ జనతా పార్టీ ఇప్పటిది కాదు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించే సమయానికి ఏపీలో ఎంటర్ అయింది ఆ పార్టీ. ఉమ్మడి ఏపీలో విశాఖ మహానగరంలో ప్రత్యక్ష ఎన్నికల ద్వారా మేయర్ పదవిని సొంతం చేసుకుంది బిజెపి. అటు తర్వాత తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది. అంతకంటే ముందే విజయాన్ని దక్కించుకున్న బీజేపీ మాత్రం వెనుకబడిపోయింది. తెలుగుదేశం పార్టీతో పొత్తు ఉంటే పదుల సంఖ్యలో సీట్లు దక్కించుకుంటోంది. లేకుంటే ఉనికి చాటుకోవడానికి కూడా ఇబ్బంది పడుతోంది. ఈ పరిస్థితి దశాబ్దాలుగా మారడం లేదు. నాయకత్వాలు మారినా సరైన ఫలితం దక్కడం లేదు బిజెపికి. యావత్తు భారతదేశాన్ని ఆవహిస్తున్న బిజెపి.. ఏపీలో ఎందుకు వెనుకబడిపోతుంది అనేది ఇప్పటికీ ధర్మసందేహమే.

## పుట్టా మహేష్ ఎపిసోడ్...టీడీపీ సైలెంట్...రీజనేంటి ?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏలూరుకు చెందిన టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ హైదరాబాద్ లో ఒక డ్రగ్స్ కేసులో ఇరుక్కోవడం టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని ఒక్కసారిగా కదిలించింది. ప్రత్యేకంగా టీడీపీలో చూస్తే కనుక ఇది అతి పెద్ద షాకింగ్ గా మారింది. డ్రగ్స్ కేసులో సామాన్య నాయకుడు ఎవరైనా ఇరుక్కుంటే ఆ కథ వేరు, కానీ ఒక పార్లమెంట్ సభ్యుడు ఇందులో ఉన్నారు అన్న ప్రచారం దాని మీద ఆరోపణలు ఇవన్నీ చూసినపుడు తెలుగుదేశం పార్టీలో ఇది అతి పెద్ద చర్చలు దారి తీస్తోంది. అంతర్గతంగానే తీవ్ర స్థాయిలో ఈ ఇష్యూ మీద నాయకుల మధ్య చర్చ సాగుతోంది అని అంటున్నారు.



**కడప నుంచి తెచ్చి:**
ఇదిలా ఉంటే ఎక్కడో కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన పుట్టా మహేష్ కి గోదావరి జిల్లాలలో గుండె కాయ లాంటి ఏలూరు పార్లమెంట్ సీటు ఇవ్వడమే పెద్ద తప్పు అన్నట్లుగా కూడా పార్టీలో అంతర్గత చర్చ సాగుతోంది అని అంటున్నారు. గోదావరి జిల్లాలో ఉన్న స్థానికులను కాదని ఈ సీటు ఎలా ఇస్తారు అని ఆనాడే పార్టీలో ఒక అసంతృప్తి అయితే వ్యక్తం అయింది. కానీ అది ఇపుడు మరోసారి గట్టిగా చర్చకు దారి తీసే స్థాయిలో వినిపిస్తోంది అని అంటున్నారు. స్థానికంగా రెండు సార్లు ఎంపీగా ఎమ్మెల్యేగా గెలిచిన మాగంటి బాబు లాంటి పెద్ద నాయకులు ఉండగా వలసవాదులకు టికెట్లు ఇవ్వాలనుకోవడమే అధిష్టానం నాడు తీసుకున్న ఒక రాంగ్ డెసిషన్ అని చర్చ కూడా సాగుతోంది అంటున్నారు. ఏరి కోరి ఆయనను తెచ్చి మరీ టికెట్ ఇవ్వడం ద్వారానే ఇపుడు ఇబ్బందులు పడాల్సి వస్తోంది అన్న కోణంలోనూ చర్చ సాగుతోంది అని అంటున్నారు.

**కుట్ర జరిగిందా :**
ఇదిలా ఉంటే టీడీపీ అభిమానులు యాక్టివిస్టులు కొంతమంది అయితే సోషల్ మీడియాలో మాత్రం పుట్టా మహేష్ ని సమర్థిస్తూ పోస్టులు పెడుతున్నారు. ఈ విషయంలో మహేష్ కి అన్యాయం జరుగుతోందని, ఆయన బీసీ నేత కావడం వల్లనే ఈ రకంగా చేస్తున్నారు అని కూడా అంటున్నారు. అయితే ఈ కేసు విషయంలో మాత్రం టీడీపీకి అంతా ఇరకాటమైన పరిస్థితి ఉందని అంటున్నారు బయటకు నేతలు ఎవరూ బాహాటంగా ఏదీ చెప్పలేని పరిస్థితి ఉందని అంటున్నారు. ఎలా రియాక్ట్ కావాలి అన్నది కూడా ఎవరికీ అర్థం కావడం లేదని అంటున్నారు.

**పార్టీకే ట్రబుల్ గా :**
మరో వైపు చూస్తే టీడీపీని అభిమానించే వారి వాదన మరోలా ఉంది. కొందరినాయకులు చేసే తప్పులు పొరపాట్ల వల్లనే పార్టీకి ఇబ్బందులు వస్తున్నాయని అంటున్నారు. అయినా సరే ఇది సున్నితమైన అంశంగానే పార్టీలో ఉందని చెబుతున్నారు. బీసీ నేత యువ నాయకుడు, మరో సీనియర్ నేతకు బంధువు ఇలా పుట్టా మహేష్ చుట్టూ చాలా విషయాలు కోణాలు ఉన్నాయి. దాంతో ఎవరూ బయటపడి గట్టిగా అనే పరిస్థితి లేదని కూడా గుర్తు చేస్తున్నారు. అదే సమయంలో బీసీ నేత మీదకు గురి పెడతారా అని వైసీపీ లాంటి ప్రత్యర్థి పార్టీల మీద విరుచుకు పడాలనుకున్నా ఈ కేసు క్లియర్ కట్ గా ఇపుడు కనిపిస్తోంది అని అంటున్నారు.

**బెయిల్ ఇచ్చినా కూడా :**
ఇక ఈ కేసు విషయంలో ఎంపీగా పుట్టా మహేష్ కి పోలీసులు తాత్కాలికంగా బెయిల్ ఇచ్చారని అంటున్నారు. ఎందుకు అంటే ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయి. కాబట్టి ఎంపీగా సభకు హాజరయ్యేందుకు ఆయనకు ఈ బెయిల్ వచ్చింది అని చెబుతున్నారు. అయితే ఈ మొత్తం ఎపిసోడ్ లో పార్టీగా టీడీపీయే కార్నర్ అవుతోంది అని అంటున్నారు సమాధానం చెప్పుకోలేని స్థితిలోకి పార్టీ వెళ్తోంది అన్న ఆవేదన కూడా చాలా మంది పార్టీ నేతలలో ఉంది. అందుకే పార్టీలో ఒక రకమైన సైలెంట్ కనిపిస్తోంది అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే ఈ తరహా పరిణామాలతో టీడీపీ కానీ కూటమి నేతలు కానీ ప్రస్తుతానికి మౌనంగానే ఉంటూ వస్తున్నారు. ఈ ఇష్యూలో ఏమి జరుగుతుంది ఎటు మలుపు తిరుగుతుంది అన్నది అయితే చూడాల్సి ఉందని అంటున్నారు.

## జగన్ సొంత రాజకీయాలు...

**విజయవాడ, మార్చి 16, పెన్ పవర్:**
వైసీపీ అధినేత జగన్ కోటరీని పక్కన పెట్టాలని ఆ పార్టీలో .. పై స్థాయి నేతల నుంచి కింది స్థాయి క్యాడర్ వరకూ కోరుకుంటున్నారు. జగన్ నేరుగా అందరితో టచ్ లో ఉండకపోవచ్చు కానీ అసలు మొత్తం ఆయన తరపున కోటరీలోకీలక వ్యక్తులుగా చెలామణి అవుతున్న నేతలే చక్కబెడుతున్నారు. జగన్ కు తెలుస్తుందో లేదో కూడా క్యాడర్ కు తెలియడం లేదు. అయితే రెండు రోజుల కిందట జరిగిన ఆవిర్భావ దినోత్సవం రోజున కొద్ది సేపే అయినా స్క్రిప్ట్ లేకుండా ప్రసంగించడం, ఆ కార్యక్రమంలో ఆయన పక్కన కోటరీ నేతలెవరూ లేకపోవడం పార్టీ క్యాడర్ లో ఆశలు నింపుతోంది. వైసీపీ ఆవిర్భావ దినోత్సవం వేదికగా జగన్ తీరులో కనిపిస్తున్న మార్పు ఇప్పుడు ఆ పార్టీలో హాట్ టాపిక్ అయ్యింది. సాధారణంగా జగన్ అంటేనే చుట్టూ ఒక ప్రత్యేక కోటరీ ఉంటుంది. ఆ కోటరీని దాటుకుని సామాన్య కార్యకర్త వెళ్లడం అసాధ్యమనే ముద్ర పడిపోయింది. గత ఐదేళ్లుగా జగన్ తీసుకున్న అనేక నిర్ణయాల్లో ఆ ముగ్గురు నలుగురు కీలక నేతల పాత్రే ఎక్కువగా ఉందనే అసహనం పార్టీలో ఉంది. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులు జగన్ దృష్టికి వెళ్లకుండా ఈ కోటరీ అడ్డుపడుతోందని సీనియర్ నేతలు సైతం లోలోపల మదనపడుతున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఈ అసంతృప్తి మరింత పెరిగింది. కోటరీకి ఉన్న అతి సాన్నిహిత్యం వల్ల పార్టీ నేతల మధ్య దూరం పెరిగిందని క్యాడర్ గట్టిగా నమ్ముతోంది. ఇప్పుడు జగన్ ఈ వర్గాన్ని పక్కన పెడుతున్నట్లు కనిపిస్తుండటం కార్యకర్తలకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది. సాధారణంగా జగన్ ప్రసంగాలు పక్కాగా రాసి పెట్టుకున్న కాగితాల చుట్టూ సాగుతుంటాయి.



కానీ ఆవిర్భావ దినోత్సవం నాడు ఆయన ఏ కాగితం చూడకుండా మనసులో ఉన్నది మాట్లాడారు. ఇది నాయకత్వ శైలిలో మార్పును సూచిస్తోంది. నేరుగా ప్రజలతో కార్యకర్తలతో కనెక్ట్ అవ్వాలంటే మధ్యలో సలహాదారులు ఉండకూడదని జగన్ గుర్తించినట్లు కనిపిస్తోంది. కోటరీ చెప్పే లెక్కల కంటే కార్యకర్తల ఆవేదన వింటేనే పార్టీకి పూర్వవైభవం వస్తుందని ఆయన భావిస్తున్నట్లు ఈ ప్రసంగం ద్వారా అర్థమవుతోంది. కేవలం ఒక రోజు వేడుకతోనే ఈ మార్పు ఆగిపోతే ఫలితం ఉండదని విశ్లేషకులు చెబుతున్నారు. సలహాదారులు ఇచ్చే సమాచారంపైనే ఆధారపడకుండా జిల్లాల వారీగా ముఖ్య నేతలు కింది స్థాయి కార్యకర్తలతో జగన్ నేరుగా టచ్ లో ఉండాలి. లోటస్ పాండ్ లో లేదా తాడేపల్లిలో గదుల మధ్య జరిగే సమీక్షల కంటే క్షేత్రస్థాయి పర్యటనలు పెంచాలని క్యాడర్ ఆశిస్తోంది. ఇప్పటికైనా కళ్లు తెరిచారని కోటరీని దూరంగా పెట్టి సొంతంగా నిర్ణయాలు తీసుకోవడం మొదలుపెట్టారని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు నాయకుడి చుట్టూ ఉండే వ్యక్తుల కంటే జెండా మోసే కార్యకర్తలే శ్రీరామరక్ష అని జగన్ కి ఆలస్యంగానైనా అర్థమైందన్న భావన వ్యక్తమవుతోంది. జగన్ తనంతట తానుగా బయటకు వచ్చి ప్రజలతో మమేకమైతే అటు ప్రభుత్వ వ్యతిరేక పోరాటంలోనూ ఇటు పార్టీని బలోపేతం చేయడంలోనూ వేగం పెరుగుతుందని అనుకోవచ్చు. మరి ఇదే పద్ధతిని ఆయన భవిష్యత్తులో కూడా కొనసాగిస్తారా లేక మళ్లీ పాత సలహాదారుల మాయలో పడతారా అన్నది వేచి చూడాలి.

# నమన్ అవార్డ్స్‌లో బీసీసీఐ బ్లండర్ మిస్టేక్స్.. సోషల్ మీడియాలో విమర్శలు




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ నియంత్రణ మండలి నిర్వహించిన వార్షిక నమన్ అవార్డ్స్ కార్యక్రమంలో జరిగిన కొన్ని తప్పిదాల కారణంగా సోషల్ మీడియాలో క్రికెట్ అభిమానులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. మార్చి 15న ఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో 2025వ ఏడాదిలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన ఆటగాళ్లకు అవార్డులు అందజేయడంతో పాటు ఐసీసీ ట్రోఫీలు గెలిచిన భారత జట్లను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పురుషుల జట్టు 2025లో గెలిచిన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ, 2026లో సాధించిన టీ20 ప్రపంచకప్ విజయాలకు గాను సత్కారం చేసింది. అలాగే మహిళల జట్టు 2025లో వన్డే ప్రపంచకప్ ట్రోఫీని కైవసం చేసుకోవడంతో బీసీసీఐ ప్రత్యేకంగా అభినందించింది.

అలాగే2025లో అండర్- 19 మహిళల ప్రపంచకప్ గెలిచిన, 2026లో అండర్- 19 మెన్స్ ప్రపంచకప్ సాధించిన జట్లకు కూడా బీసీసీఐ ప్రత్యేకంగా సత్కారం చేసింది. అండర్- 19 మహిళల జట్టు కెప్టెన్ నిక్కీ ప్రసాద్ నేతృత్వంలో విజయం సాధించినప్పటికీ, స్టేజ్‌పై ప్రదర్శించిన గ్రాఫిక్‌లో మాత్రం హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలోని సీనియర్ మహిళల జట్టు ప్రపంచకప్ గెలిచిన ఫోటోను ప్రదర్శించడంతో అభిమానులు ఆశ్చర్యపోయారు. విజేత జట్ల నుంచి ముగ్గురు ప్లేయర్స్ ని స్టేజ్‌పైకి ఆహ్వానించి ప్రముఖ వ్యాఖ్యాత హర్షా భోగ్లేతో మాట్లాడించారు. ఈ సందర్భంగా మహిళల ప్రపంచకప్ గెలిచిన జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, 2026 టీ20 ప్రపంచకప్ గెలిచిన పురుషుల జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, అలాగే ఛాంపియన్స్ ట్రోఫీ విజేత జట్టు వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్టేజ్‌పై పాల్గొన్నారు. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ విజేత జట్టు కెప్టెన్‌గా ఉన్న రోహిత్ శర్మ ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. దీంతో నిర్వాహకులు మరో పొరపాటు కూడా చేశారు. ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన జట్టు కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ పేరు ప్రదర్శించడంతో సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. 2025లో అద్భుత ప్రదర్శన చేసిన గిల్‌కు ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ క్రికెటర్‌గా (పురుషుల విభాగంలో) శుభ్‌మాన్ గిల్ అత్యంత ప్రతిష్టాత్మకమైన (పాలీ ఉమ్రిగర్ అవార్డును) క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందుకున్నారు. 2025లో అన్ని ఫార్మాట్లలో కలిపి 35 మ్యాచ్‌లలో 1,764 పరుగులు చేసి, సగటు 49తో 7 సెంచరీలు చేసి, అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా గిల్ నిలిచాడు. కాగా ఈ కార్యక్రమంలో జరిగిన పొరపాట్లు సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తూ బీసీసీఐపై క్రికెట్ అభిమానులు తీవ్రంగా మండిపడుతున్నారు.

# ఐపీఎల్10 జట్ల కెప్టెన్లు వీరే.. ఏ టీమ్‌కి ఎవరో తెలుసుకుందామా..!




**హైదరాబాద్ పెన్ పవర్:** మార్చి 28వ తేదీన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 ప్రారంభం కానుంది. దీంతో ఐపీఎల్ లో ఎన్నో సంవత్సరాలుగా మహేంద్ర సింగ్ ధోనీ, రోహిత్ శర్మ లాంటి వారు ఆయా జట్లను ముందుండి నడిపించారు. దీంతో చెన్నై, ముంబై వంటి టీమ్స్ చెరో ఐదు సార్లు ట్రోఫీని కైవసం చేసుకున్నాయి. కానీ ఇప్పుడు ఐపీఎల్ 2026 సీజన్ సమీపిస్తుంది. దీంతో ఆయా జట్లు నాయకత్వంలో కొన్ని మార్పులు చేశాయి. కొన్ని జట్లు కొత్త కెప్టెన్లతో టోర్నీలోకి వస్తుండగా, మరి కొన్ని టీమ్స్ నయా ప్లేయర్స్ కి ఈసారి కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించడంతో తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి సిద్ధంగా ఉన్నారు.చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ మరోసారి నాయకత్వం వహించనున్నాడు. ఐదు సార్లు ఛాంపియన్ గా నిలిచిన ఈ జట్టు గత సీజన్‌లో ఆశించిన మేరకు ఫలితాలు సాధించలేకపోయింది. దీంతో లీగ్ మధ్యలో గాయంతో గైక్వాడ్ కూడా జట్టుకు దూరమయ్యాడు. అయితే మహేంద్ర సింగ్ ధోనీ జట్టు పగ్గాలు అందుకున్నప్పటికీ ఫలితం మారలేదు. ఈసారి గైక్వాడ్ బ్యాటింగ్‌తో పాటు నాయకత్వంలో కూడా తన ప్రతిభను చూపించాల్సి ఉంటుంది.

**ఢిల్లీ క్యాపిటల్స్ - అక్షర్ పటేల్:**
ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు అక్షర్ పటేల్ పూర్తి స్థాయి కెప్టెన్‌గా మొదటిసారి బాధ్యతలు స్వీకరిస్తున్నాడు. జట్టులో అనుభవజ్ఞులు ఉన్నప్పటికీ ఫ్రాంచైజీ అతనిపై నమ్మకం ఉంచింది. గత కొన్నేళ్లుగా జట్టుకు అత్యంత స్థిరమైన ఆటగాడిగా నిలిచిన అక్షర్ ఇప్పుడు కెప్టెన్సీ ఒత్తిడిని ఎలా ఎదుర్కొంటాడో అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు.

**గుజరాత్ టైటాన్స్- శుభ్‌మన్ గిల్:**
గుజరాత్ టైటాన్స్ జట్టుకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. 2022లో టైటిల్ గెలిచిన ఈ జట్టుకు 2024లో గిల్ నాయకత్వం చేపట్టాడు. గత రెండు సీజన్లు మంచి ప్రదర్శన చేసినప్పటికీ పూర్తిస్థాయి విజయాన్ని సాధించలేకపోయింది. ఈసారి జట్టు మరింత మెరుగైన ఫలితాలను ఆశిస్తోంది.

**కోల్‌కతా నైట్ రైడర్స్ - అజింక్య రహానే:**

మూడుసార్లు ఐపీఎల్ విజేతలైనా కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకు అజింక్య రహానే నాయకత్వం వహించనున్నాడు. అనుభవజ్ఞుడైన రహానే ఒత్తిడిని తట్టుకుని జట్టుని ముందుకు నడిపిస్తాడనే నమ్మకం ఫ్రాంచైజీకి ఉంది. సమతుల్యమైన జట్టుతో ఈసారి మరో టైటిల్ గెలవడమే వారి లక్ష్యంగా పెట్టుకున్నారు.

**లక్నో సూపర్ జెయింట్స్ - రిషభ్ పంత్:**
లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు రిషభ్ పంత్ మరోసారి కెప్టెన్‌గా కొనసాగుతున్నారు. గత సీజన్‌లో అతను బ్యాటింగ్ లో పెద్దగా రాణించలేదు.. కెప్టెన్సీలో కూడా అనుకున్నంతగా సక్సెస్ కాలేదు.. అయినప్పటికీ అతని దూకుడు, ధైర్యం జట్టుకు పెద్ద బలంగా చెప్పాలి.

**ముంబై ఇండియన్స్ - హార్దిక్ పాండ్యా:**
ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటైన ముంబై ఇండియన్స్‌కు హార్దిక్ పాండ్యా నాయకత్వం వహిస్తున్నాడు. జట్టులో అనేక మంది ఆటగాళ్లు మ్యాచ్ విన్నర్లు ఉండటంతో ముంబై ఎప్పుడూ బలమైన ప్రత్యర్థిగానే కొనసాగుతుంది. అన్నీ సరిగ్గా కలిసొస్తే ఈసారి టైటిల్ రేసులో ముందుండే అవకాశం ఉంది.

**పంజాబ్ కింగ్స్ - శ్రేయస్ అయ్యర్:**
పంజాబ్ కింగ్స్ జట్టుకు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా రెండో సీజన్ లో కూడా కొనసాగుతున్నాడు. గత సీజన్‌లో పంజాబ్ ని

ఫైనల్ వరకు చేర్చిన తర్వాత కేవలం 6 పరుగుల తేడాతో టైటిల్ కోల్పోయింది. ఆ ప్రయాణంలో అయ్యర్ కీలక పాత్ర పోషించాడు. ఈసారి జట్టును మరోసారి టైటిల్‌కు చేరవేయాలనే లక్ష్యంతో ముందుకు నడుస్తున్నాడు.

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు - రాజత్ పాటిదార్:**
డిఫెండింగ్ ఛాంపియన్స్ అయిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు రాజత్ పాటిదార్ కెప్టెన్‌గా ఉన్నాడు. అతని నాయకత్వంలో ఆర్సీబీ తొలి ఐపీఎల్ టైటిల్ గెలిచింది. 18 సంవత్సరాల నిరీక్షణకు తెరదించిన ఆ విజయాన్ని ఈసారి కూడా కొనసాగించాలనే లక్ష్యంతో జట్టు ఉంది.

**సన్‌రైజర్స్ హైదరాబాద్ - ప్యాట్ కమిన్స్:**
సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ ప్యాట్ కమిన్స్ మరోసారి నాయకత్వం వహించనున్నాడు. ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌లో ఎక్కువగా ఆడకపోవడంతో అతను తాజాగా ఈ టోర్నమెంట్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నాడు. ముఖ్యంగా బ్యాటింగ్ విభాగంలో బలమైన జట్టుగా హైదరాబాద్ కనిపిస్తోంది.

**రాజస్థాన్ రాయల్స్ - రియాన్ పరాగ్:**
రాజస్థాన్ రాయల్స్ జట్టుకు యువ ఆటగాడు రియాన్ పరాగ్ కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించాడు. ఇంతకు ముందు కొన్ని మ్యాచ్‌లకు మాత్రమే నాయకత్వం వహించిన అతను ఇప్పుడు పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టాడు. సంజూ సాంసన్ చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీకి మారడంతో పరాగ్ కెరీర్‌లో ఇది కీలకమైన అవకాశంగా మారింది.

దీంతో ఐపీఎల్ 2026లో అనుభవజ్ఞులతో పాటు యువ కెప్టెన్ల మిశ్రమంతో ఆసక్తికరమైన పోటీ నెలకొంది. ప్రతి జట్టు తమ కెప్టెన్ నాయకత్వంలో టైటిల్ కోసం పోరాడేందుకు రెడీ అవుతుంది.



సోనాల్ చౌహాన్ సొగసైన బ్లాక్ గ్లామ్ లుక్‌లో స్టన్స్

# పెళ్లి తర్వాత జోరు పెంచిన విజయ్ దేవరకొండ.. ఏకంగా 5 చిత్రాలు.. క్యూలో దిగ్గజ దర్శకులు



టాలీవుడ్ రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ ఇప్పుడు ఫుల్ జోష్‌లో ఉన్నారు. పెళ్లి తర్వాత తన వ్యక్తిగత జీవితాన్ని ఎంజాయ్ చేస్తూనే, ప్రొఫెషనల్ లైఫ్‌లో మునుపెన్నడూ లేని విధంగా స్పీడ్ పెంచారు. ఏకంగా ఐదు భారీ ప్రాజెక్టులను లైన్‌లో పెట్టి బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటడానికి సిద్ధమయ్యారు. దిగ్గజ దర్శకులతో జతకడుతూ, వైవిధ్యమైన కథలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విజయ్ దేవరకొండ క్రేజీ లైనప్ వివరాలు ఇప్పుడు మనం తెలుసుకుందాం.

**బాక్సాఫీస్ వేటలో 'రణబాలి', 'రౌడీ జనార్ధన':**
విజయ్ దేవరకొండ ప్రస్తుతం నటిస్తున్న చిత్రాల్లో 'రణబాలి' అత్యంత కీలకంగా మారింది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాలో రష్మిక మందన్న కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రం సెప్టెంబర్ 11, 2026న విడుదల కావడానికి సిద్ధంగా ఉంది. దీనితో పాటు రవికిరణ్ కోలా దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మిస్తున్న 'రౌడీ జనార్ధన' (ఎఐ15) పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ పక్కా మాస్ ఎంటర్టైనర్ విజయ్‌ను మళ్ళీ సక్సెస్ ట్రాక్ ఎక్కిస్తుందని అభిమానులు నమ్మకంగా ఉన్నారు.

**క్యూలో దిగ్గజ దర్శకులు.. భారీ లైనప్:**
ఈ రెండు సినిమాలే కాకుండా, విజయ్ దేవరకొండ మరికొన్ని సెన్సేషనల్ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'హాయ్ నాన్న' సినిమాతో తన ప్రతిభను చాటుకున్న డైరెక్టర్ శౌర్యువ్‌తో ఒక కొత్త సినిమా చేయబోతున్నారు. ఇక వీటితో పాటు టాలీవుడ్ టాప్ డైరెక్టర్ సుకుమార్‌తో ఒక క్రేజీ ప్రాజెక్ట్ చర్చల దశలో ఉంది. అలాగే మాస్ డైరెక్టర్ హరీష్ శంకర్‌తో కూడా ఒక సినిమా లైన్‌లో పెట్టినట్లు సమాచారం. గౌతమ్ తిన్ననూరితో చేస్తున్న ఎఐ12 ప్రాజెక్ట్ కూడా షూటింగ్ జరుపుకుంటోంది. ఇలా వరుసగా ఐదు సినిమాలతో విజయ్ రాబోయే రెండేళ్లపాటు థియేటర్లలో సందడి చేయనున్నారు.

**రౌడీ బాయ్ పాన్ ఇండియా ప్లాన్:**
విజయ్ దేవరకొండ కేవలం తెలుగు మార్కెట్ మీదనే కాకుండా, పాన్ ఇండియా లెవల్లో తన మార్కెట్ పెంచుకోవాలని ప్లాన్ చేస్తున్నారు. ఆయన ఎంచుకుంటున్న కథలు ఇప్పుడు చాలా వైవిధ్యంగా ఉంటున్నాయి. ఇక రెగ్యులర్ లవ్ స్టోరీలకు భిన్నంగా యాక్షన్, పీరియాడిక్ డ్రామాలు ఉండేలా జాగ్రత్త పడుతున్నారు. ఈ భారీ లైనప్ చూస్తుంటే పెళ్లి తర్వాత విజయ్ దేవరకొండ కెరీర్ మరో రేంజ్‌కు వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. ముఖ్యంగా రష్మికతో చేస్తున్న సినిమా రికార్డులను తిరగరాస్తుందని ట్రేడ్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. రౌడీ బాయ్ ఫ్యాన్స్‌కు మాత్రం రాబోయే రోజుల్లో పండుగే అని చెప్పాలి.



సారా అర్జున్ యొక్క రాయల్ ఎత్నిక్ లుక్ స్పాట్‌లైట్‌ను దొంగిలించింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com